



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక **PEN POWER TELUGU DAILY** ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక :62 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 5 నవంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :62 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 5 NOVEMBER 2024 PRICE : 5/- RS

*Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur*


# ఒలింపిక్స్ లో స్వర్ణం గెలిస్తే
# రూ.7 కోట్లు ఇస్తాం...
## దేశంలోనే నెంబర్ వన్ గా ఏపీ

- ఏపీ కొత్త క్రీడా విధానంపై చంద్రబాబు సమీక్ష
- క్రీడా పోటీల్లో పతకాలు గెలిచేవారికి భారీగా ప్రోత్సాహకాలు
- క్రీడా ప్రోత్సాహకాలు అందించడంలో దేశంలోనే నెంబర్ వన్ కానున్న ఏపీ



పెన్ పవర్ డెస్క్:క్రీడా పోటీల్లో పతకాలు సాధించే వారికి మంచి ప్రోత్సాహకాలు అందిస్తే క్రీడల పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇవాళ ఆయన రాష్ట్ర నూతన క్రీడా పాలసీపై అధికారులతో చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో పతకాలు పొందిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రోత్సాహకాల్లో హర్యానా రాష్ట్రం ముందుండగా.....ముఖ్యమంత్రి సూచనలతో కొత్త పాలసీలో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ప్రోత్సాహలు ఇచ్చే రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ.75 లక్షలు ఇస్తుండగా... ఇకపై రూ.7 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే రజత పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు ఇస్తుండగా.....ఇకపై రూ.5 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ. 30 లక్షలు ఇస్తుండగా ఇకపై రూ.3 కోట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అంతేకాదు, ఒలింపిక్స్ లో పాల్గొన్న వారికి రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని సీఎం సూచించారు. అదే విధంగా ఏషియన్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.4 కోట్లు, రజత పతకం సాధించిన వారికి రూ.2 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.1 కోటి చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని సూచించారు. ఏషియన్స్ గేమ్స్ లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు.

వరల్డ్ ఛాంపియన్ షిప్, వరల్డ్ కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.35 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. నేషనల్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.10 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.5 లక్షలు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.3 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.2.50 లక్షలు, రజత పతకం సాధించిన వారికి రూ.2 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.1 లక్ష చొప్పున ప్రోత్సాహం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఒలంపిక్, ఏషియన్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారికి గ్రూప్-1 ఉద్యోగులుగా నియమిస్తామని తెలిపారు. ఈ సూచనల ప్రకారం మార్పులు చేసి కేబినెట్ లో నూతన పాలసీ తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# నేను హెూంశాఖను తీసుకున్నానంటే...
## పోలీసులపై నిప్పులు చెరిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- సొంత నియోజకవర్గంలో పవన్ పర్యటన
- పిఠాపురం సభకు హాజరు
- పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ ఆగ్రహం
- బాధ్యతగా వ్యవహరించాలని హెూంమంత్రి అనితకు సూచన
- పరిస్థితి చేయి దాటితే తాను హెూం శాఖను తీసుకుంటానని వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పర్యటించారు. పిఠాపురంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్... రాష్ట్రంలోని పోలీసులపై నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వ పాలనలో గరుడ్ అనే ఎస్పీ తనపై జులుం ప్రదర్శించాడని వెల్లడించారు. ప్రజలకు అభివాదం చేస్తుంటే, కూర్చోమంటూ

వివరాలు 2లో..

# తిరుమలకు జగన్ స్టిక్కర్‌తో మాజీ మంత్రి అంబటి రాంబాబు...



పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అయితే, ఆయన మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఫొటో ఉన్న స్టిక్కర్‌తో తిరుమలకు వెళ్లారు. రాజకీయ పార్టీల జెండాలు, చిహ్నాలు, స్టిక్కర్లతో స్వామివారి దర్శనానికి రావడం టీటీడీ నిబంధనలకు విరుద్ధం. అయినా అంబటి తన షర్ట్‌పై జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్‌తో రావడం అనేది ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

# ఏపీ టెట్ ఫలితాల విడుదల.. అర్హత సాధించిన అభ్యర్థులకు లోకేశ్ శుభాకాంక్షలు

- టెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి లోకేశ్
- అక్టోబర్ 3 నుంచి 21 వరకు టెట్
- 1,87,256 మంది అభ్యర్థుల ఉత్తీర్ణత
- త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామన్న లోకేశ్

వివరాలు 2లో..



# సీఎం చంద్రబాబును కలిసిన వేమిరెడ్డి దంపతులు

- టీటీడీ మెంబర్ గా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చిన ప్రశాంతి రెడ్డి
- సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు



పెన్ పవర్ డెస్క్:నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేడు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చిన వేమిరెడ్డి దంపతులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల వేమిరెడ్డి ప్రశాంతిని ఏపీ ప్రభుత్వం టీటీడీ పాలకమండలి

వివరాలు 2లో..

# డిసెంబరు చివరినాటికి అమరావతి పనులకు టెండర్లు

- రూ.38 వేల కోట్లతో అమరావతి పనులకు టెండర్లు
- చీఫ్ ఇంజినీర్ల కమిటీ నివేదిక ఆధారంగా కార్యాచరణ
- ఐదు బెస్ట్ సిటీల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తామన్న నారాయణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర రాజధాని అమరావతి నగరం లో వివిధ అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలుస్తున్నామని ఏపీ పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అసెంబ్లీ భవనాలు, రోడ్లు, అధికా రుల భవనాలు, హైకోర్టు భవనాలు, జడ్జిలు, మంత్రుల బంగ్లాలకు సంబంధించి రూ.38 వేల కోట్లతో టెండర్లకు సంబంధించిన కార్యాచరణ మొదలైందని తెలిపారు.

వివరాలు 2లో..

# ఐపీఎల్ తరహాలోనే ఏపీఎల్


- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ అన్న ఎంపీ
- గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ ఆటగాళ్ల వెలికితీతకు కృషి చేస్తున్నట్లు వెల్లడి
- అతి త్వరలో అందుబాటులోకి మూలపాడు క్రికెట్ స్టేడియంలోని రెండో గ్రౌండ్
- మూలపాడుకు అన్నీ అనుకూలిస్తే గోల్ఫ్ కోర్స్ కూడా వస్తుందన్న కేశినేని చిన్ని



పెన్ పవర్ డెస్క్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ నిర్వహిస్తామని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ ఆటగాళ్ల వెలికితీతకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అతి త్వరలో మూలపాడు క్రికెట్ స్టేడియంలోని రెండో గ్రౌండ్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మూలపాడులో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్మాణానికి

వివరాలు 2లో..

# ఉత్తరాఖండ్ లో ఘోర ప్రమాదం..
## బస్సు లోయలో పడడంతో 36 మంది దుర్మరణం



- సోమవారం ఉదయం మార్చులా వద్ద యాక్సిడెంట్
- ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు
- రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

పెన్ పవర్ డెస్క్:ఉత్తరాఖండ్ లో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న ఓ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. దీంతో 36 మంది ప్రయాణికులు అక్కడికక్కడే చనిపోయారు. ఘటనా స్థలంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.అల్మోరా జిల్లా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్వాల్ నుంచి కుమావూ వెళుతున్న

వివరాలు 2లో..

# మూసీ ప్రక్షాళనను అడ్డుకొని బద్నాం చేయాలనుకుంటున్నారు



- చిన్న చిన్న కారణాలతో అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శ
- ప్రక్షాళన అగిపోతే రాజకీయాల్లో కొనసాగడం వృథా అని వ్యాఖ్య
- మూసీ పరీవాహక ప్రాంత ప్రజల్ని బీఆర్ఎస్ పట్టించుకోలేదని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిన్నర మంది జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన మూసీ ప్రక్షాళనను అన్యాయంగా అడ్డుకొని

వివరాలు 2లో..

# ప్రభుత్వ ఆదాయం పెంపుపై తెలంగాణ డిప్యూటీ సీఎం సూచనలు

- ప్రజలపై భారం పడకుండానే ఆదాయం పెంచాలన్న భట్టి విక్రమార్క
- జాయింట్ వెంచర్లలో వివాదాలను పరిష్కరించి ఆదాయం పెంచాలని సూచన
- నగరం వెలుపలకు తరలి వెళ్లే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలన్న డిప్యూటీ సీఎం



పెన్ పవర్ డెస్క్: ప్రభుత్వ ఆదాయం పెంపుపై ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలపై భారం పడకుండానే ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. భట్టి విక్రమార్క అధ్యక్షతన ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### గ్యారెంటీ పే చర్చ...

ఎన్నికల్లో గెలిపిస్తే ప్రతి ఇంటికి కోటి రూపాయలు. ఒక్కసారి కాదు ప్రతి ఏటా కోటి రూపాయలు. ప్రతి ఇంటికి ఓ హెలికాప్టర్. కొత్త జంటకు బంగారు నగలు, మూడంతస్తుల బిల్డింగ్. ఆడవాళ్లకు వంటింటి పనిభారం తగ్గించేందుకు రోబోలు, కాల్వల్లో ఈదడానికి ప్రతి కుటుంబానికి ఓ పడవ. తమిళనాడు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన ఓ జర్నలిస్ట్ ఇచ్చిన హామీలు ఇవి. ఆపరేషన్ దుర్యోధన సినిమాలో.. హైదరాబాద్‌కు సముద్రాన్ని తెస్తానని హీరో ప్రామిస్ చేస్తే అంతా నవ్వుకున్నాం గానీ.. తమిళనాడులో నిజంగానే హామీలిచ్చాడు. ఇందులో.. ఎదుటివాళ్లు హామీలు ఇస్తున్నారు కదా అని ఓటు వేయొద్దని చెప్పడం ఒక ఉద్దేశం అయితే.. పార్టీల హామీలపై సెటైర్లు వేయడం మరో ఉద్దేశం. కలర్ టీవీలు, ఫ్యాన్లు, మిక్సీలు, ల్యాప్‌టాప్‌లు.. ఇలా ఎన్ని హామీలు ఇచ్చారో తమిళనాడులో. ఆ రాష్ట్రం సంగతేమో గానీ.. దేశవ్యాప్తంగా ఎన్నికల హామీలపై ఓ చర్చ అయితే జరుగుతోందిప్పుడు. కాంగ్రెస్ హామీలపై మోదీ చేసిన కామెంట్.. 'కాస్త చూసుకుని హామీలు ఇవ్వండంటూ' ఖర్గే చెప్పడం చూశాక.. 'గ్యారెంటీ పే చర్చ' నడుస్తోంది. గెలవడానికి హామీలు ఇవ్వడం, గెలిచాక చతికిలపడడం, ప్రజల్లో నమ్మకం కోల్పోవడం.. కొన్ని పార్టీలకు ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది అసలు విషయం. ఇంతకీ.. మోదీ ఎందుకని పర్టిక్యులర్‌గా తెలంగాణ, కర్నాటకను ఎగ్జాంపుల్‌గా చూపించారు? ఖర్గే ఎందుకని జాగ్రత్తపడ్డారు? బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మరోసారి ఆలోచించుకుంటామని కర్నాటక ప్రభుత్వం ఎందుకంది? ఉచితాలపై ఇస్తున్న హామీల విషయంలో కాంగ్రెస్ మారాలి అంటున్నారాయన. సూపర్-5, సూపర్-6, సూపర్-10.. ఇలాంటి హామీలపై పునరాలోచించుకుందాం అన్నారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సహా మేధావులు, ఆర్థిక నిపుణులు మొత్తుకుంటున్నది, హెచ్చరిస్తున్నది దీని గురించే. ఇంతకీ మల్లికార్జున ఖర్గే ఏమన్నారు? ఒక హామీ ఇచ్చే ముందు.. 'అది సాధ్యమా కాదా, ఖజానాలో డబ్బులు ఉన్నాయా లేవా, ఐదేళ్ల పాటు నడిపించగలమా లేదా' అనేది చూసుకోమంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేయాల్సినంత అవసరం రాకూడదు అంటున్నారు. గల్లా పెట్టెలో డబ్బుల్లేకపోయినా పథకాలు అమలుచేస్తే.. అది భవిష్యత్ తరాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ స్టేట్‌మెంట్‌లో ప్రతి అక్షరమూ నిజమే. మరో మాట కూడా అన్నారు మల్లికార్జున ఖర్గే. కనీసం రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ఇక పథకాలు అమలు చేసి ఏం లాభం అని. పథకాలు ఇచ్చుకుంటూ పోయి అభివృద్ధి చేయలేకపోతే ప్రజలు తిరగబడతారన్నారు. అదే జరిగితే.. భవిష్యత్ తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదంటూ హెచ్చరికలు చేశారు.కొందరు కామెంట్ చేయొచ్చు. 'ఏం.. హామీలు ఇచ్చే ముందు తెలియలేదా ఆ విషయం' అని. ఇప్పటికైనా ఆ మేల్కొలుపు మాటలు అంటున్నందుకు సంతోషించాలి గానీ కామెంట్ చేయనక్కర్లేదు. అంతా బాగానే ఉంది గానీ.. ఈ జ్ఞానోదయం వెనక కారణం ఏంటి? ఓవైపు మహారాష్ట్ర ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ.. పథకాల విషయంలో ఈ వెనకడుగు ఏంటి? ఎందుకంటే.. కర్నాటకలో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణం పథకాన్ని ఆపేయడమో లేదా పరిమితులు విధించడమో చేయబోతున్నారని ఓ ప్రచారం నడుస్తోంది. అది నిజమే అన్నట్టుగా.. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా స్టేట్‌మెంట్ ఇచ్చారు. 'ఎస్.. ఉచిత బస్సుపై పునరాలోచనలో ఉన్నాం' అంటూ మాట్లాడారు. ఈ పథకాన్ని పూర్తిగా తీసేయకపోవచ్చు గానీ.. ప్రభుత్వంపై భారం తగ్గించుకునే ప్రయత్నం అయితే చేయొచ్చని చెబుతున్నారు. దీనిపై మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. 'ముందుగా హామీ ఇవ్వడం ఎందుకు, ఇప్పుడు వెనక్కి తగ్గడం ఎందుకు' అని ఖర్గే కామెంట్ చేసినట్టుగా చెబుతున్నారు.కాంగ్రెస్ చీఫ్ నుంచి ఈ మాట వచ్చిందో లేదో.. వెంటనే ఖర్గే వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు ప్రధాని మోదీ. 'అమలుచేయలేని హామీలు ఇవ్వడం సులభమే.. వాటిని అమలు చేయడం ఎంత కష్టమో ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ గుర్తిస్తోంది' అంటూ ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. అక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో, అభివృద్ధి ఎలా కుంటుపడిందో చూడాలంటూ కామెంట్ చేశారు. వెంటనే.. మాజీ మంత్రి కేటీఆర్ కూడా అందుకున్నారు. గాలిమాటల గ్యారెంటీలతో మొదటికే మోసం వస్తుందన్న విషయం కాంగ్రెస్‌కు ఇప్పుడు అర్థమయిందా అంటూ విమర్శించారు. గ్యారెంటీల పేరుతో చేసిన మోసం క్షమించలేనిదంటూ ఫైర్ అయ్యారు. కర్నాటకలో ఐదు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో వల వేసినప్పుడు బడ్జెట్ గురించి తెలియదా అంటూ నిలదీశారు కేటీఆర్. అఫ్‌కోర్స్ ఈ కామెంట్లకు కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చిందనుకోండి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రధాని మోదీని ప్రశ్నించారు ఖర్గే. ప్రధాని మోదీ తెలంగాణ టాపిక్ తీసుకురావడంతో.. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. ఉచిత బస్సు ప్రయాణంతో తెలంగాణ మహిళలకు 3,433 కోట్ల రూపాయలు ఆదా అయిందన్నారు. 18వేల కోట్ల రూపాయలతో దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయల వరకు వైద్య సదుపాయం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 50వేలకు పైగా ఉద్యోగ నియామకాలు, హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలు 40 శాతం పెంపు.. ఇలా ఏ బీజేపీ పాలిత రాష్ట్రాన్ని తీసుకున్నా.. తెలంగాణదే రికార్డ్ అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్.. ఇలా సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ దూసుకుపోతున్నామని బదులు ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. 13 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందంటూ ఓ వైపు టీడీపీ విమర్శించినా సరే..గత జగన్ ప్రభుత్వం మాత్రం పథకాలు పంచుతూనే వెళ్లింది. ఐదేళ్లలో 2 లక్షల 74 వేల కోట్ల రూపాయలు అక్కచెల్లెమ్మలకు నేరుగా పంచామని చెప్పుకున్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్. కాని, అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా.. పోయిన ఎన్నికల్లో ఓట్లు వేయలేదు ఏపీ ప్రజలు. తెలంగాణలోనూ అదే జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోనే ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలయ్యాయి. కాని, పట్టణాల్లో ఎక్కువ సీట్లు వచ్చాయి. సంక్షేమంతోనే ఎన్నికల్లో గెలుస్తాం అని ఏ పార్టీ అయినా అనుకుంటే అది పొరపాటు అవుతుందనడానికి తెలుగు రాష్ట్రాలే బెస్ట్ ఎగ్జాంపుల్. , రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే.. సంపద సృష్టి జరగొచ్చు గాక. కాని అది వెంటనే జరిగిపోదుగా. రెండేళ్లో, ఐదేళ్లో పట్టొచ్చు. ఆ తరువాత ఆ సంపద నుంచి ఆదాయం పెరగొచ్చు. కాని, అంతకంటే ముందు జరగాల్సింది పథకాల అమలు. వచ్చీ రాగానే పథకాలు కావాలి, ఇవ్వాలి అనే అడుగుతారు జనం. సో, సంపద సృష్టించి, పథకాలు అమలు చేస్తాం అనే మాట కరెక్టే గానీ.. ఆ రెండింటికీ టైమ్ గ్యాప్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఈలోపు పథకాలు అమలు చేయాల్సిందే. సో, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతుంటుంది. ఓవైపు ఖజానాలో డబ్బు ఉండదు. కాని, ప్రజలకు వెంటనే పంచేయాలి. అంటే ఏం చేయాలి..? అభివృద్ధి పనులు ఆపేయాలి. లేదా ప్రజలపై భారం మోపాలి. అలా చేస్తే అల్టిమేట్‌గా నష్టపోయేది ప్రజలే. ప్రజలపై భారాలు మోపితేనే సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లే పరిస్థితి వస్తుంది. అలా చేశారనే కదా.. 'బాదుడే బాదుడు' నినాదాన్ని తీసుకొచ్చింది టీడీపీ. ప్రజల్లో కూడా 'ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కుంటున్నారు' అనే అభిప్రాయం ఏర్పడింది. ఒకవేళ ప్రజలపై భారం మోపకూడదు అనుకుంటే.. ఎడాపెడా అప్పులు చేయాలి. అలాంటప్పుడు గత ప్రభుత్వం చేస్తున్న తప్పే ఈ ప్రభుత్వం చేస్తున్నట్టు కదా. లేదా.. అభివృద్ధి విషయంలో కాంప్రమైజ్ అవ్వాలి. ఏపీలో అదే జరిగిందంటారు రాజకీయ విశ్లేషకులు. సంక్షేమ పథకాలపైనే ఫుల్ ఫోకస్ పెట్టే సరికి గత జగన్ సర్కార్ అభివృద్ధిని మ్యాచ్ చేయలేకపోయింది అనే విమర్శ ఎదుర్కొంది. సో, ఇలాంటి తలనొప్పులు రాకూడదని ముందు జాగ్రత్తగా ఓ మంచి సూచన చేశారు మల్లికార్జున ఖర్గే. హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర బడ్జెట్ అనుమతిస్తుందా లేదా అనేది చూసుకోవాలన్నారు. ఎందుకంటే.. డబ్బులేం ఊరికే రావు. అవేం ఆకాశం నుంచో ఊడిపడవు, చెట్లకు కాయవు. సో, ఉన్నంతలో ప్రజలకు ఎలా మేలు చేయగలమో ఆలోచించాలన్నారు మల్లికార్జున ఖర్గే. ఇప్పటికైనా.. ఖర్గే సూచనను ఓ అలారమ్‌గా తీసుకుని మేల్కొంటే మంచిదంటున్నారు మేధావులు

# నేను హోంశాఖను తీసుకున్నానంటే... పోలీసులపై నిప్పులు చెరిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

తనను భయపెట్టే ప్రయత్నం చేశాడని వివరించారు.

"నన్ను కూర్చోమని భయపెడతారు సరే.. మరి ఒక రేపిస్టును మీరు ఎందుకు వదిలేస్తారు? ఒక ముఖ్యమంత్రిని చంపేస్తామని చెప్పినవాడ్ని ఎందుకు వదిలేస్తారు మీరు? మాకు ఈ అన్యాయం జరుగుతోంది అని సోషల్ మీడియాలో పెడితే, అన్యాయానికి కారకులైన వారిని మీరు వదిలేస్తారు! గత ప్రభుత్వ పాలన తాలూకు ఫలితాలు ఇవన్నీ. అప్పులు ఎలా వారసత్వంగా వస్తాయో, వీరు చేసిన నేరాలు కూడా అలాగే వారసత్వంగా వచ్చాయి. వీళ్లు చేసిన అలసత్వం కూడా వారసత్వంగా వచ్చింది. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి చెబుతున్నాను... లా అండ్ ఆర్డర్ బలంగా అమలు చేయండి అని చెబుతుంటే, పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. ఇదివరకేమో శాంతిభద్రతలు మొత్తం నియంత్రణలో లేకుండా చేసేశారు, ఇప్పుడేమో ధర్మబద్ధంగా శాంతిభద్రతలు అమలు చేయమంటుంటే ఆలోచిస్తున్నారు... ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో అర్థం కావడంలేదు.

క్రిమినల్ కు కులం ఉండదు, క్రిమినల్ కు మతం ఉండదు... పోలీసు అధికారులకు ఎన్నిసార్లు చెప్పాలి? ఒకడ్ని అరెస్ట్ చేయాలంటే కులం సమస్య వస్తుందంటారు... కులం సమస్య ఎందుకు వస్తుంది? మూడేళ్ల ఆడబిడ్డను రేప్ చేస్తే కులాన్ని వెనుకేసుకొస్తారా మీరు? ఏం మాట్లాడుతున్నారు మీరు? మీరు ఐపీఎస్ చదివారు కదా...

ఇండియన్ పీనల్ కోడ్ ఏం చెబుతోంది మీకు? క్రిమినల్స్ ను వెనకేసుకురమ్మని భారతీయ శిక్షా స్మృతి చెబుతోందా మీకు? పోలీసు అధికారులు మారాలి... ఇదే మీకు చివరి హెచ్చరిక!పోలీసు అధికారులకు చెబుతున్నాను, డీజీపీ గారికి కూడా చెబుతున్నాను... ఇంటెలిజెన్స్ అధికారులకు, జిల్లా ఎస్పీలకు చెబుతున్నాను... జిల్లా కలెక్టర్లకు చెబుతున్నాను... అభివృద్ధికి లా అండ్ ఆర్డర్ చాలా కీలకమైనది. హోంశాఖ మంత్రి అనిత గారికి కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. వైసీపీ వ్యక్తులు ఇష్టం వచ్చినట్టు రౌడీల్లా వ్యవహరిస్తుంటే మీరేం చేస్తున్నారు? ఆడబిడ్డలను అవమానిస్తుంటే మీరు చర్యలు తీసుకోరా? మీరు బాధ్యతగా వ్యవహరించండి... చట్టపరంగా బలంగా వ్యవహరించండి. నేను పంచాయతీరాజ్ శాఖ మంత్రిని... హోంమంత్రిని కాను. పరిస్థితి చేయిదాటితే నేనే హోంశాఖను తీసుకుంటాను... నేను హోంశాఖను తీసుకుంటే యూపీ

సీఎం యోగి ఆదిత్యనాథ్ లా వ్యవహరిస్తాను. డిప్యూటీ సీఎం పదవి పోయినా ఫర్వాలేదు... ప్రజల కోసం పోరాటం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. ఇళ్లలోకి వచ్చి రేప్ లు చేస్తాం అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు... అది భావప్రకటనా స్వేచ్ఛ అని వైసీపీ నేతలు అంటున్నారు. తెగేదాకా లాగకండి... ఈ ప్రభుత్వానికి సహనం ఎంతుంటుందో, ఈ ప్రభుత్వానికి తెగింపు కూడా పదింతలు ఎక్కువ ఉంటుంది. అధికారంలో ఉన్నాం కాబట్టే సంయయనం పాటిస్తున్నాం... చేతకాక కాదు" అని పవన్ స్పష్టం చేశారు.

# డిసెంబరు చివరినాటికి అమరావతి పనులకు టెండర్లు

- మొదటి పేజీ తరువాయి

జులై 24న చీఫ్ ఇంజినీర్లతో టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేశామని, రాజధాని పనులకు సంబంధించి చీఫ్ ఇంజినీర్ల కమిటీ అక్టోబరు 29న నివేదిక సమర్పించిందని చెప్పారు. ఇంజినీర్ల కమిటీ నివేదిక ప్రకారం సీఆర్డీఏ ముందుకు వెళుతుందని అన్నారు. ఈ క్రమంలో, డిసెంబరు చివరి నాటికి అమరావతికి సంబంధించి అన్ని టెండర్లు పిలవాలని ఆదేశించామని మంత్రి నారాయణ తెలిపారు. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి కావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు. కాగా, రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు రూ.15 వేల కోట్ల రుణం ఇస్తుందని అన్నారు. నీరుకొండ, శాఖమూరు, కృష్ణాయపాలెం వద్ద రిజర్వాయర్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ఉండవల్లి వద్ద 7,350 క్యూసెక్కుల సామర్థ్యంతో కూడిన వాటర్ పంపింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత వైసీపీ సర్కారు రాజధాని పేరిట మూడు ముక్కలాట ఆడిందని నారాయణ విమర్శించారు.

కానీ, కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచంలోని ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

# ప్రభుత్వ ఆదాయం పెంపుపై తెలంగాణ డిప్యూటీ సీఎం సూచనలు

- మొదటి పేజీ తరువాయి

ఉపసంఘం ఈరోజు సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాయింట్ వెంచర్లలో వివాదాలను పరిష్కరించి ఆదాయం పెంచాలని సూచించారు. ఇందుకోసం ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తమకు ప్రోత్సాహకాలు అందిస్తే నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు వెళతామని వివిధ పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారని, అదే జరిగితే నగరంలో కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. కాబట్టి వారి విజ్ఞప్తులను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట పరిశ్రమలను స్థాపించుకునేలా ప్రోత్సాహకాలు ఉండాలన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన వేమిరెడ్డి దంపతులు

- మొదటి పేజీ తరువాయి

సభ్యురాలిగా నియమించింది. ఈ నేపథ్యంలో, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నేడు చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను ప్రశాంతి రెడ్డి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కాగా, నిన్న నెల్లూరు జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో ఆసక్తికర పరిణామం జరగడం తెలిసిందే. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ హాజరైన ఈ కార్యక్రమానికి ఎంపీ హోదాలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా వచ్చారు.

అయితే, వేదికపై ఉన్న ఆయనకు అధికారులు బొకే ఇవ్వడం మర్చిపోయారు. దాంతో ఆయన అలిగి అక్కడ్నించి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కూడా భర్త వెంటే అక్కడ్నించి నిష్క్రమించారు.

# మూసీ ప్రక్షాళనను అడ్డుకొని బద్నాం చేయాలనుకుంటున్నారు

- మొదటి పేజీ తరువాయి

తమను బద్నాం చేయాలని చూస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విపక్షాలపై మండిపడ్డారు. అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని, లేదంటే మూసీ మురికి ప్రజలను మరింత పీడిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే ఇక రాజకీయాల్లో కొనసాగడం వృథా అన్నారు.

కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆ నదుల నీళ్లతో వ్యవసాయం చేస్తుంటే మూసీ పరీవాహక ప్రాంతంలోని నల్గొండ ప్రజలు మురికి నీటిని ఎందుకు వాడుకోవాలని నిలదీశారు. మూసీ ప్రక్షాళన కోసం అందరం కలిసి కట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని విమర్శించారు. దశాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు కాళ్లు, చేతులు వంకరలు పోయి, క్యాన్సర్ వంటి జబ్బులతో చచ్చిపోతుంటే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.

# ఉత్తరాఖండ్ లో ఘోర ప్రమాదం.. బస్సు లోయలో పడడంతో 36 మంది దుర్మరణం

- మొదటి పేజీ తరువాయి

బస్సు మార్చులా వద్ద అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న 200 అడుగుల లోయలో పడిపోయింది. దీంతో బస్సులోని 40 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. అందులో 20 మంది అక్కడికక్కడే చనిపోయారు. స్థానికుల సమాచారంతో వేగంగా స్పందించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెస్క్యూ ఆపరేషన్ లో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. బాధితులను కాపాడేందుకు శ్రమిస్తున్నారు. గాయపడ్డ ప్రయాణికులను దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో పరిస్థితి విషమించడంతో మరో 16 మంది కన్నుమూశారు. కాగా, ఈ ప్రమాదం గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానంటూ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ..

ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం అందజేస్తామని తెలిపారు. గాయపడ్డ వారికి రూ.లక్ష చొప్పున సాయం ప్రకటించారు. ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వైరీకి ఆదేశించినట్లు సీఎం ధామి తెలిపారు.

# ఏపీ టెట్ ఫలితాల విడుదల.. అర్హత సాధించిన అభ్యర్థులకు లోకేశ్ శుభాకాంక్షలు

పెన్ పవర్ డెస్క్:ఏపీలో ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్ 2024) ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. అక్టోబర్ 3 నుంచి 21 వరకు టెట్ నిర్వహించారు. తాజాగా ఈ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. నిజానికి ఈ నెల 2నే ఫలితాలు విడుదల కావాల్సి ఉండగా తుది కీ వెల్లడిలో ఆలస్యం కారణంగా నేడు విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఎక్స్ ద్వారా స్పందించారు. రాష్ట్రంలోని యువత, నిరుద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్‌లో నిర్వహించిన టెట్ -2024 ఫలితాలను ఈరోజు విడుదల చేసినట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 3,68,661 మంది హాజరుకాగా, అందులో 1,87,256 ( 50.79 శాతం) మంది అర్హత సాధించినట్టు తెలిపారు. ఫలితాలను (%ష్ట్రజూం://ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ%) ద్వారా తెలుసుకోవచ్చన్నారు. నిరుద్యోగ టీచర్లకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. టెట్ లో అర్హత సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఐపీఎల్ తరహాలోనే ఏపీఎల్

- మొదటి పేజీ తరువాయి

ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇక్కడి మైదా నాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏసీఏ తరఫున మూలపాడులో ఏడాదిలోపు క్రికెట్ అకాడమీ వస్తుందని చెప్పారు. మూలపాడుకు అన్నీ అనుకూలిస్తే గోల్ఫ్ కోర్స్ వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో మూలపాడు, మంగళగిరిలో రెండు క్రికెట్ స్టేడియాలు ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఈ రెండు స్టేడియాలను ఏడాదిలోపు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని కేశినేని చిన్ని చెప్పుకొచ్చారు.

# డెడికేటెడ్ కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ వెంకటేశ్వరరావు నియామకం

తెలంగాణలో కులగణన నేపథ్యంలో ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ వెంకటేశ్వరరావును నియమించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. చైర్మన్‌ను నియమించిన ప్రభుత్వం... రిజర్వేషన్లపై నెల రోజుల్లోగా నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఎల్లుండి నుంచి తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల ప్రాతిపదికన సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా... న్యాయపరమైన చిక్కులు లేకుండా కోర్టు తీర్పులను అనుసరించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం సమీక్షించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

# హీరో విజయ్ పొలిటికల్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ ఏమన్నారంటే...!

కోలీవుడ్ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్ ఇటీవల తొలిసారిగా రాజకీయ సభ నిర్వహించడం తెలిసిందే. ఈ సభలో అధికార డీఎంకే పార్టీపై విజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎంకే పార్టీని తమ రాజకీయ ప్రత్యర్థిగా పరిగణిస్తామని ప్రకటించారు. విజయ్ వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ స్పందించారు. విజయ్ పేరెత్తకుండా, విమర్శనాస్త్రాలు సంధించారు. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన వారు కూడా డీఎంకే పార్టీ తుడిచిపెట్టుకుపోవాలంటున్నారని తెలిపారు. ఇలాంటి రాజకీయ పసికూనలు చేసే వ్యాఖ్యలను డీఎంకే పట్టించుకోబోదని స్పష్టం చేశారు. "వారికి ఇదే నా హృదయపూర్వక విజ్ఞప్తి... ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని చూడండి. మేం విజయవంతంగా త్వరలోనే నాలుగో ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. ఈ సందర్భంగా సీఎన్ అన్నాదురై మాటలను ఓసారి స్మరించుకుందాం. "విరోధులారా వర్ధిల్లండి" అని అన్నాదురై నాడు చేసిన వ్యాఖ్యలే మాకు స్ఫూర్తి. ఇంతకంటే ఎక్కువగా స్పందించలేను. ఎవరో ఏదో అంటే నేను అస్సలు పట్టించుకోను. ప్రజలకు సేవ చేయడంపైనే మా ప్రధాన దృష్టి. విమర్శించే వారందరికీ సమాధానం చెబుతూ పోవడం కుదరదు... టైమ్ వేస్ట్ తప్ప మరే ప్రయోజనం లేదు. మాకు ఉన్న సమయం అంతా ప్రజా సేవ కోసమే వినియోగిస్తాం. ప్రజలు ఏ నమ్మకంతో మమ్మల్ని గత ఎన్నికలప్పుడు గెలిపించారో, అదే నమ్మకంతో మేం ప్రజాపాలనకు కట్టుబడి ఉన్నాం" అని స్టాలిన్ వివరించారు.

తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో అనితా అచీవర్స్ అకాడమీ తరఫున సంక్షేమ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో సీఎం స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఆయన పై వ్యాఖ్యలు చేశారు.


10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
## ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

## స్వామివారిని దర్శించుకున్న మంత్రి సుభాష్.



**కె గంగవరం, పెన్ పవర్, నవంబర్ 4:** కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా కె గంగవరం మండలం కోటిపల్లి శ్రీ ఛాయ సోమేశ్వర స్వామివారినీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.ఆలయచ్చుకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు.ఆలయ కమిటీ సభ్యులు,ఆలయ ఈవో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి సభ్యులు, సుభాష్ సేవా సమితి తదితరులు పాల్గొన్నారు.

## దెందులూరులో టీడీపీ వర్సెస్ జనసేన




**ఏలూరు, పెన్ పవర్ నవంబర్ 4:**
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక నియోజకవర్గాల్లో మిత్ర పక్షాల మధ్య విభేదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆధిపత్య పోరు నడుస్తుంది. మద్యం దుకాణాల కేటాయింపు, ఇసుక సిండికేట్లు, నామినేటెడ్ పదవుల విషయంలో ఇలా ప్రతి విషయంలో ఒకరినొకరిపై విమర్శలు చేసుకుంటున్నారు. ప్రధానంగా కూటమి పార్టీలు స్వీప్ చేసిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఈ ఆధిపత్య పోరు ఎక్కువగా కనపడుతుంది. ఇటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, అటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు వెళుతున్నప్పటికీ కూటమి నేతల మధ్య విభేదాలు పార్టీ అధినేతలకు తలనొప్పిగా మారాయి.. ప్రధానంగా పింఛన్ల పంపిణీ విషయంలో కూడా ఈరోజు అనేక నియోజకవర్గాల్లో కూటమి పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. తాము పింఛను పంపిణీ చేయాలని ఒకరంటే.. తాము కూడా భాగస్వామ్యులవుతామని జనసేన నేతలు కూడా రెడీ అవుతుండటంతోనే ఈ పరిస్థితులు తలెత్తాయి. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి వీరిరెవ్వరంటూ టీడీపీ నేతలు జనసేన నేతలను ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో కలసి పోటీ చేసి, అభ్యర్థి విజయానికి ఇద్దరూ కృషి చేసినప్పటికీ, తర్వాత మాత్రం అనేక అంశాలు విభేదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విభేదాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చినట్లు తెలిసింది.పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరు, చింతలపూడి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. వీరు ఒకరినొకరు వీధుల్లోకి వచ్చి తిట్టుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. ఇది పెద్ద పంచాయతీగా మారింది. అయితే దెందులూరులో విభేదాలపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పందించారు.కొన్ని అరాచక శక్తులు ఇటీవలే జనసేనలో చేరారని,పబ్బం గడుపుకోవడానికే వాళ్లు పార్టీలో చేరారని చింతమనేని అన్నారు.చేరినవాళు చేరినట్టు ఉంటే మంచిదని,పెన్షన్ల పంపిణీతో వాళ్లకు సంబంధమేంటని ఆయన ప్రశ్నించారు.గ్రామాల్లో గొడవలు పెట్టే సంస్కృతి మానుకోవాలని కోరారు.ఆ రోజు కూటమి ఓటమికి ప్రయత్నించింది వీళ్లేనని, ఇప్పుడుపార్టీలో చేరి అధికారం చెలాయిస్తామంటే కుదరదని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. జనసేన అధినాయకత్వంతో తాను మాట్లాడతానని చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

విజయనగరం నెల్లిమర్లలోనూ....

వైసీపీ హయాంలో జనమంతా విసిగిపోయారు. ప్రభుత్వం మారాలనే ఉద్దేశంతో ఏపీలో కూటమి నేతలు ఒక్కట్కై పనిచేశారు. ఊహించిన దానికంటే అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు. కలసి పనిచేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు.. రానురాను మితివిరీరుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో అయితే.. నువ్వా-నేనా అన్నట్లుగా పరిస్థితి ఉందని.. సొంత పార్టీల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే లోకం మాధవి వర్సెస్ టీడీపీ ఇన్‌ఛార్జ్ బంగార్రాజుగా మారిందట. ఇప్పటివరకూ లోలోపలే తన్నులాడుకున్న వారు.. ప్రస్తుతం రోడ్డెక్కారనే టాక్ బలంగా వినిపిస్తోంది.విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం కూటమిలో కుమ్ములాటలు బహిర్గతం అవుతున్నాయట. మొన్నటి వరకూ లోలోపలే కత్తులు దూసుకున్న నాయకులు నేడు బహిరంగంగానే బాహాబాహీకి దిగుతున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి విభేదాలు చేరుకున్నాయట. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ అనికూడా చూడకుండా బంగార్రాజును లోకం మాధవి అవమానించారట. రూఎని పిలిచి? ఇతనిని బయటకి పంపించాలంటూ హకుం జారీ చేయటంతో నగర పంచాయతీ సమావేశంలో ఆయన కంగుతున్నారట. తర్వాత కుదుటపడి. బంగార్రాజు కూడా ఎమ్మెల్యేకి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారట. తాను ఆహ్వానం మేరకే సమావేశానికి వచ్చానని.. దానిపై తనకు క్లారిటీ ఉందని బదులు ఇవ్వటంతో సమావేశం కాస్తా హీట్‌గా మారిందట. నియోజకవర్గంలో ఇలాంటి గొడవలు కొత్తేవిరీ కాదట. ఇటీవల చింతలవలస రోడ్డు శంకుస్థాపన అంశంలోనూ ఇలాంటి సీన్ జరిగిందట. శంకుస్థాపన కార్యక్రమానికి తమకెందుకు ఆహ్వానం ఇవ్వలేదని తెలుగు తమ్ముళ్లు.. జనసేన ఎంపీపీని అడ్డుకున్నారు. కూటమిలో అందరం కలసి పనిచేస్తేనే గెలుపు సాధ్యమైందని అలాంటపుడు తమను ఎలా పక్కన పెడతారనేది టీడీపీ వాదనగా తెలుస్తోంది. మమ్మల్ని పిలవకుండానే.. వీరేరే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారా అని ప్రశ్నించటంతో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొందట. దీంతో సదరు ఎంపీపీ వెనక్కి వెళ్లిపోయారు. ఈ పంచాయితీ అక్కడితో ఆగలేదు. ఇదే విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కూడా చేసేదేం లేక.. విభేదాలు లేకుండా పని చేయాలని సూచనలు మాత్రమే చేశారట.మరోవైపు.. తెలుగుదేశం కూడా జనసేకు షాకులిస్తూనే ఉందట. మార్క్ ఫెడ్ ఛైర్మన్ అయ్యాక ఏర్పాటు చేసిన సభకి ఎమ్మెల్యే లోకం మాధవికి ఆహ్వానం లేదట. కేవలం టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలను మాత్రమే ఆహ్వానించారు . ఇలా ఎప్పటికప్పుడే కూటమిలో కుమ్ములాటలు బహిర్గతం అవుతున్నాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. కర్రోతు బంగార్రాజును కూడా ఎక్కడా తగ్గవద్దని.. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ భరత్.. హింట్ ఇచ్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి. కనీసం ఓటు బ్యాంక్ లేని వాళ్లని ఎమ్మెల్యేగా చేస్తే? రివర్స్ అవ్వటం ఏంటని టీడీపీ సీనియర్లు సైతం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందే ఊహించిన మాధవి.. కేడర్‌ను పెంచుకునే పనిలో పడ్డారట. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారనే టాక్ బలంగా వినిపిస్తుంది . తనకి నియోజకవర్గంలో తగిన బలం ఉండాలనే తపనలో ఆమె ఉన్నారని తెలుస్తోంది. నెల్లిమర్లలో టీడీపీని తట్టుకొని నిలబడాలంటే.. సీనియర్ నాయకుల అవసరం ఉందని గ్రహించిన మాధవి.. వైసీపీ సీనియర్లకు గాలమేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. జనసేనాని అండదండలు కూడా మాధవికి.. బలంగానే ఉన్నాయనే టాక్ ఉంది. జనసేన పార్టీకి మాధవి ఫండిరగ్ చేస్తుండడం వల్లే ఆమెకు అంత ప్రాధాన్యత అనే విమర్శించిన వాళ్లూ నియోజకవర్గంలో ఉన్నారట.బంగార్రాజు – మాధవి వ్యవహార శ్కెలితో.. లోకల్ లీడర్లు ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారట. ప్రభుత్వంలో కంటే ప్రతిపక్షమే బెటర్ అనే ఫీలింగ్‌తో కొందరు ఉన్నారంటే.. నెల్లిమర్లలో పరిస్థితి ఏంటనేది తెలుస్తోంది. టీడీపీ నాయకులకు ఎలాంటి పనులు చేయవద్దని మాధవి ఇప్పటికే అధికారులకు హుకుం జారీ చేశారన్న టాక్ వినిపిస్తోంది. తాను చెప్పిన నాయకులు వస్తేనే పనులు చేయాలంటూ ఎమ్మెల్యే చెప్పటంతో వివాదం కాస్తా ఎక్కువ అవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గొడవలు ముదరకముందే.. రెండు పార్టీల అధినేతలూ పిలిపించి మాట్లాడితే తప్ప పరిస్థితిలో మార్పు రాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

## అర్జీ ఫిర్యాదుల ,పరిష్కార వేదికలో, 180 అర్జీలు, స్వీకరించిన, కలెక్టర్.





**అమలాపురం పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 4:** అర్జీ దారుల సమస్యల పట్ల తక్షణమే స్పందించి నిర్దేశిత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశిం చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు జిల్లా స్థాయి అధికారులతో ప్రజా ఫి ర్యాదుల పరిష్కార వేదిక మీకోసం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి,జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని ఎం ఝాన్సీ రాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి మదన్మోహన్రా వులు అర్జీదారుల నుండి 180 అర్జీలను స్వీకరించా రు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్య క్రమానికి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను సావధానంగా విని కొన్ని సమస్యలకు అందు బాటులో ఉన్న జిల్లా స్థాయి అధికారులను సంప్రదించి పరిష్కార మార్గాలు చూపారు. ప్రజా సమస్య లు సత్వరమే పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మీకోసం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిం దన్నారు. ప్రతి శాఖకు సంబందించి జిల్లా, డివి జన్, మండల స్థాయి అధికారులవారి పరిధి లోని అర్జీలను నిర్ణీత గడువు లోగా, రీ ఓపెన్ కు ఆస్కారం లేకుండా సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా సమస్యల పట్ల పూర్తి అవగాహనతో నిష్పక్షపా తంగా విచారణచేసి, గడువులోగా పరిష్కార మార్గాలు నాణ్యతతో చూపాలన్నారు పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వీస్ రిక్వెస్ట్ ముందుగా విశ్లేషించుకుని పరిష్క రించాలని గడువు లోగా పరిష్కరించని పక్షంలో అవి సమస్యలు గ్రీవెన్స్ గా వచ్చేందుకు అవకా శాలు ఉన్నాయన్నారు. ఏ స్థాయిలో సమస్యను ఆ స్థాయిలోనే పరిష్కరించా లని ఆదేశించారు వినతు ల పరిష్కారంలో నాణ్య తా ప్రమాణాలు పాటిస్తూ పరిష్కరించేందుకు ప్రత్యే క శ్రద్ధ వహించాలని సూచించారు. మీకోసం కార్యక్రమంలో ఆన్లైన్లో వచ్చే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో సంబంధిత శాఖాధికారి లాగిన్ను ఓపెన్ చేసి పరిష్కారం కొరకు చర్యలు చేపట్టా లని, సమస్య తమ శాఖ పరిధిలోనిది కానట్లయితే సరైన కారణాలు స్పష్టం గా చూపుతూ తిరస్కరిం చాలన్నారు. పరిష్కరించి న అర్జీలను అర్జీదారుని సంతకం ఫోటోలతో ఆన్లై న్లో అప్లోడ్ చేయాలన్నా రు. ఎట్టి పరిస్థితులలో నూ ఒకే అంశంపై మళ్లీ మళ్లీ ఫిర్యాదులు నమో దు కాకుండా అప్రమత్తం గా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ లు రామకృష్ణారెడ్డి, సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి, సిపిఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు డి సి హెచ్ ఎస్ కార్తీక్ వివిధ శాఖల కు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిస్థితి చేయి దాటితే నేనే హెూం మంత్రి

### పవన్ సంచలన కామెంట్స్



**పిఠాపురం పెన్ పవర్, నవంబర్ 4:** డిప్యూటీ సీఎం పవన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం లో పలు కర్యాక్రమల్లో పాల్గోన్న పవన్ రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాల విషయంలో అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. క్రిమినల్‌కు కులం, మతం ఉండదు. రేప్ చేసిన వాళ్లను అరెస్ట్ చేయడానికి కులం అడ్డొస్తుందా? అధికారులు ఏం చేస్తున్నారు.. క్రిమినల్స్‌ను వదిలేయమని చట్టం చెప్తోందా అని ప్రశ్నించారు. పోలీసులు, కలెక్టర్లు పదే పదే చెప్పించుకోవద్దని పవన్ హెచ్చరించారు. లా అండ్ ఆర్డర్ కీలకమైనది. శాంతిభద్రతలు కాపాడటంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదన్నారు. మేము ఎవరినీ వెనకేసుకు రావడం లేదు.. మీరు కూడా వెనకేసుకు రావద్దన్నారు పవన్.

హెూం మంత్రి అనిత కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు డిప్యూటీ సీఎం పవన్. తాను హెూం మంత్రి బాధ్యతలు తీసుకుంటే పరిస్థితులు వేరేలా ఉంటాయన్నారు. అందరూ బాగుండాలని కోరుకునే వాడిని నేను. మాది ప్రతీకార ప్రభుత్వం కాదు.. అలాగని చేతగాని ప్రభుత్వం కాదు. అధికారులు అలసత్వం వహిస్తే తానే హెూం మంత్రి బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

కూటమి పార్టీల్లోని నేతల తీరుపైనా పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమిని ఎవరు చెడగొట్టలేరని, వ్యక్తులు వచ్చి ఎవరికి వారు సొంత పెత్తనం చేసుకుని గేమ్స్ ఆడితే తమను ఏమీ చేయలేరన్నారు. తాను, చంద్రబాబు క్లారిటీతో ఉన్నామన్న పవన్ కళ్యాణ్.. ఈ పొత్తు స్థిరమైందని.. కొంతమంది వ్యక్తులు చేసే ప్రయత్నాలు తమ పొత్తును దెబ్బతీయలేవన్నారు.

## ఉజ్వల భవితకు చదువుతోపాటు సాంకేతికత అందిపుచ్చుకోవాలి: కలెక్టర్ నాగరాణి

### విద్యార్థులు ప్రొఫెసర్లు అధికారులతో కలెక్టర్ సమీక్ష



**పోడూరు (భీమవరం) పెన్ పవర్, నవంబర్ ౦4:** ఉజ్వల భవితకు చదువుతోపాటు సాంకేతికతను అంది పుచ్చుకోవాలని కలెక్టర్ సిహెచ్ నాగరాణి సూచించారు.సోమవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నాగరాణి జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రొఫెసర్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ చదువు అంటే మూస పద్ధతిలో పరీక్షలకు ఉపయోగపడేలా మాత్రమే చదవడం కాదన్నారు.డిగ్రీ పట్టాలు పొందిన తర్వాత ఏంటి అనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదని, చదువుతోపాటు సాంకేతికతను జోడించేలా వివిధ రకాలైన ప్రాజెక్టులపై దృష్టి సారించి ప్రయోగ ఫలితాల్లో విజయం సాధించాలన్నారు.అప్పుడే భవిష్యత్తుకు మంచి బాటలు ఏర్పడతాయని సూచించారు. ప్రపంచం మొత్తం మీదవున్న మల్టీనేషన్ కంపెనీలలో మన దేశం లేకుండా ఏ కంపెనీ లేదని ఇందుకు మనమందరం గర్వపడాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డ్వామా పిడి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, డి ఆర్ డి ఏ పి డి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిపిఓ అరుణ శ్రీ, డి సి హెచ్ ఎస్ డా.సూర్యనారాయణ, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ డి మహేశ్వరరావు, వివిధ కళాశాల ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్ -నలుగురి మృతి



**ఉండ్రాజవరం, పెన్ పవర్ నవంబర్ 4:** ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్ తో నలుగురు మృతి. వివాదాస్పదమైన విగ్రహావిష్కరణ, విగ్రహావిష్కరణ రోజునే విషాదం మిగిల్చింది. విద్యుత్ షాక్ నలుగురిని విగత జీవులుగా మార్చింది.

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో సోమవారం తెల్లవారుజాము చోటుచేసుకున్న విషాద సంఘటన వివరాలు. గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఆది నుండి వివాదాల మయమైంది. ఇరు వర్గాల మధ్య ఘర్షణను లేవ దీసింది. చివరికి జిల్లా కలెక్టర్, ఆర్డిఓ వంటి ఉన్నతాధికారుల చొరవతో సమస్య తీరింది. ఎట్టకేలకు సోమవారం విగ్రహావిష్కరణ, అన్న సమారాధన కు ఏర్పాటు చేసుకున్నారు నిర్వాహకులు. ఈ ఏర్పాట్లే నలుగురి ప్రాణాలను బలిగొంది. భారీ ఏర్పాట్ల నేపద్యంలో ఫ్లెక్సీలు కడుతున్న నలుగురు యువకులకు కరెంట్ షాక్ తగిలి, బొల్లా వీర్రాజు (25), కాశగాని కృష్ణ (23), పామర్తి నాగేంద్ర (25), మారిశెట్టి మణికంఠ పెద్దయ్య(29) సంఘటన స్థలం లోనే మరణించారు. మరో వ్యక్తి కోమటి అనంత రావు తీవ్రంగా గాయపడ్డాడు. వీరి ఇరువురిని హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారుజాము మూడు గంటలకు జరిగిన ఈ దుస్సంఘటన తో గ్రామంతో పాటు యావత్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు స్వాగతం పలికిన జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4 :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో భాగంగా సోమవారం రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ విమానాశ్రయం వద్ద పవన్ కళ్యాణ్ కు స్వాగతం పలికి పుష్పగుచ్చం అంద చేశారు. ఆయన వెంట జగ్గంపేట జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# స్మార్ట్ కార్డుల్లో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు

**రాజమండ్రి, పెన్ పవర్ నవంబర్ 4:** కొత్త వెహికల్స్ కొనేవారికి, లైసెన్స్‌లు తీసుకునేవారికి రాష్ట్రం ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు స్మార్ట్ కార్డుల్లో ఇవ్వనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పనుంది. రాష్ట్రంలో ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్ లు స్మార్ట్‌కార్డుల్లో రానున్నాయి. కొత్త వెహికల్స్ కొనేవారికి, లైసెన్స్‌లు తీసుకునేవారికి రాష్ట్రం ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని రవాణా శాఖలో స్మార్ట్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం అయింది. స్మార్ట్ కార్డుల సరఫరాకు టెండర్ల పిలిచేందుకు ప్రక్రియ మొదల పెట్టింది.కొత్త వాహనం కొనుక్కుని, రవాణా శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక ఇచ్చే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్స్ పొందినప్పుడు అందజేసే డీఎల్ కార్డుల జారీకి ప్రక్రియ ప్రారంభం అయింది. నవంబర్ నెల నుంచే కార్డులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున 10–12 వేల ఆర్సీ, డీఎల్ కార్డుల చొప్పున నెలకు మూడు లక్షలు, ఏడాదికి దాదాపు 36 లక్షల కార్డులు అవసరం అవుతాయి. గతంలో జిల్లా రవాణా శాఖ, ఆర్టీవో కార్యాలయాల్లో వాటిపై వివరాలు ముద్రించి, వాహనదారుల ఇళ్లకు స్పీడ్ పోస్టులో పంపేవారు. దీనికోసం రూ.200 ఫీజు, స్పీడ్ పోస్టు ఖర్చు కూడా వసూలు చేసేవారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ కార్డుల జారీకి రవాణా శాఖను ఆదేశించింది. నవంబర్ మొదటి వారం నుంచి వాహన్, సారథి పోర్టల్‌లో ఈ కార్డుల కోసం ఆప్షన్ ఇవ్వనున్నారు. దీనికి రూ.200 ఫీజుతో పాటు, స్పీడ్‌పోస్టు ఛార్జి రూ.35 ఆన్‌లైన్‌లోనే తీసుకుంటారు. స్మార్ట్ కార్డుల సరఫరాకు టెండర్లు పిలిచేందుకు రవాణా శాఖ దస్త్రం సిద్ధం చేసింది. దానిని ప్రభుత్వానికి పంపింది. అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే టెండర్లు పిలిచి, సరఫరాదారును ఎంపిక చేస్తారు.జూలై నుంచి ఈ



విధానాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్సీతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని జెరాక్స్ కాపీ వాహనదారుల వెంట ఉంచుకుంటే సరిపోతుందని ఆదేశాలు ఇచ్చింది. కాకపోతే వాహనదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ తనిఖీల సమయంలో ఆర్సీ, డీఎల్ కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మళ్లీ స్మార్ట్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది.దీంతో వాహనదారుల జేబుల్లో మరోకార్డు పెరగనుంది. వర్షాలు వచ్చే సమయంలో ఇబ్బందులు పడనక్కరలేదు. ఇది వరకు కాగితపు ధ్రువీకరణ పత్రం వర్షాలు పడితే తడిచిపోయేది. స్మార్ట్ కార్డులు వస్తే, వర్షం భయం నుంచి వాహనదారులు బయటపడతారు. దీంతో వాహనదారులకు అదనంగా కొంత ఖర్చు అవుతుంది. దాదాపు 250 వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఖర్చు అయినప్పటికీ స్మార్ట్ కార్డుతో ఉపయోగాలు ఎక్కువని వాహనదారులు భావిస్తోన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆనంద కలయిక





**పూర్వ విద్యార్థుల వన సమారాధనలో ఆటలు పాటలు**

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 4:** పదో తరగతి విద్యార్థులు 38 సంవత్సరాల తరువాత ఆనంద కేరింతల మధ్య కలుసుకున్న పూర్వ విద్యార్థులు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం లోని ఎంతో చరిత్ర కలిగిన రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో1987–1988 సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు చాలా సంవత్సరాల తరువాత ర్యాలి గ్రామంలోని మల్లవరపు సూరిబాబు ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమం లో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న వారంతా ఉద్యోగాలు, వ్యాపారవేత్తలు గా స్థిరపడి అనేక ప్రాంతాల్లో నివాసం ఉంటూ 38వ వసంతం లో మన స్నేహితులందరూ కలుసుకోవడం చాలా ఆనందదాయకం.కార్తీక మాసం పురస్కరించుకుని సోమవారం వనాల మధ్యపూర్వ స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందనిఅన్నారు. ఆనాటి మధురాతి అనుభూతులను ఒకరినొకరు చెప్పుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసుకున్న విందును కడుపునిండా ఆరగించి కడుపుబ్బ నవ్వేలా.. పసుందైన మాటలు పాటలు తో సంతోషంగా గడిపారు. ప్రతి సంవత్సరం మనందరం కలుసుకోవాలని ప్రతిజ్ఞ చేసుకున్నారు.

# రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట(గోకవరం), పెన్ పవర్, నవంబర్ 4:** గోకవరం నుండి జగ్గంపేట వెళ్లే రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. సోమవారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ రోడ్డు వర్క్ జరుగుతున్న తీరును పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కట్టుబడి ఉన్నదనడానికి నిదర్శనం రూ.826 కోట్లతో రోడ్లు వేయడానికి నిధులు సమకూర్చడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం గుంతలుగా మారిన రోడ్లన్నీ తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పాటు రోడ్లు వేయడానికి ముందుకు వస్తుందన్నారు. ఆయన వెంట జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులను హడలెత్తించిన ఆర్టీసీ బస్సు

**వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 4** :ప్రయాణికులను హడాలెత్తించిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చవలసిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు శిథిల స్థితికి చేరిన అధికారులు సర్వీసులను నడపడంపై పలువురు ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఏలేశ్వరం డిపోకు చెందిన ఏపీ 29 జెడ్ 1515 నెంబర్ కలిగిన బస్సు బయలుదేరిందని ప్రయాణికులు తెలిపారు. ఏలేశ్వరం నుండి వై రామవరం వరకు బస్సు చేరిన, ప్రయాణికులు హడలిపోయిన సంఘటన జరిగిందని అంటున్నారు. బస్సు వెనుక, పక్కనున్న అద్దాలు పగిలిపోయి ఉండడం, బస్సు అంతా కదిలిపోవడంతో ఏ సమయంలో ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేశారు. బస్సు పరిస్థితిని గమనించిన ప్రయాణికులు, మధ్యలో కొందరు దిగిపోగా, తప్పని పరిస్థితులలో కొందరు ప్రయాణం చేశారనిఅంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కండిషన్ గా ఉన్న బస్సులను ఏజెన్సీ ప్రాంతానికి పంపించాలని ప్రయాణికులు కోరుచున్నారు.





# కొంగలరావి చెట్టుకు పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని జగ్గంపేట కొంగల రావి చెట్టుకు భారతీయ ధర్మ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, కార్యదర్శి సత్య భారతి దంపతులు కొంగల రావి చెట్టుకు చుట్టూ స్టేజి నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మణి దంపతులు ముఖ్యఅతిథిగా హాజరై స్టేజి నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆ రావి చెట్టుకు పూజలు నిర్వహించారు. ముందుగా రుచి నాగేంద్ర చౌదరి కుటుంబ సభ్యులు టీటీడీ బోర్డు మెంబర్ గా నియమితులైన జ్యోతుల నెహ్రూ, మణి దంపతులను ఘనంగా సత్కరించి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని కొంగల రావిచెట్టు అపరిశుభ్రంగా ఉండటంతో మహిళలు సాక్షాత్తు మహా విష్ణు స్వరూపం లక్ష్మీ కటాక్షం ఇచ్చే రావి చెట్టును పూజించుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని అక్కడ శుభ్రపరిచి స్టేజి నిర్మించి ఉసిరి, మారేడు మొక్కలు నాటి భక్తులకు పూజలు చేసుకోవడానికి వీలుగా ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించి హిందూ ధర్మాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య పెద్దలు మానేపల్లి బంగార్రాజు, మండపాక అప్పన్న దొర, వైభోగుల కొండబాబు యాదవ్, బద్ది సురేష్, మారిశెట్టి రాధా, కొండ్రోతు శ్రీను, మానేపల్లి వీర్రాజు గుప్తా, లలిత్ బాబు, జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీ రాజన్ రాజు, పుర్రే సూరన్న, కొట్టేటి సత్తిబాబు, మీసేవ అప్పారావు, మానేపల్లి రామకృష్ణ, పుర్రె వీరబాబు, వెంట్రా ప్రగడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రామచేప రేటే వేరప్పా...



**కాకినాడ, పెన్ పవర్ నవంబర్ 4:** పులస చేప తెలుగు రాష్ట్రాల్లో ఎంత ఫేమసో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గోదావరికి వరదనీరు వచ్చినప్పుడు జాలర్లకు చిక్కే ఈ చేపలు.. వారి దండిగా కాసులను అందిస్తాయి. జులై నుంచి అక్టోబర్ వరకు పులసలు చిక్కుతూ ఉంటాయి. రుచితో పాటు ఎన్నో పోషక విలువలు ఈ చేప సొంతం. పల్లెటూర్లలో ఎవరైనా పులస.. కొని వండుకున్నారంటే.. ఊరంతా ఆ విషయాన్ని ఆ రోజు గొప్పగా చెబుతుంటారు. అది పులస రేంజ్. ఇక పులస మాదిరిగానే.. గోదావరి జిల్లాల్లో 'రామ చేప' కూడా చాలా పాపులర్. వీటికి కూడా మంచి డిమాండ్ ఉంటుంది. రామ చేపలు చూడటానికి బొమ్మిడాయిలు మాదిరిగానే ఉంటాయి. టేస్ట్ అయితే పులసల లాగానే ఉంటుందట. ఈ చేపలు 5 నుంచి 7 అంగుళాలు ఉంటాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉప్పుటేరు పరివాహక ప్రాంతాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ చేపల లభ్యత ఉంటుందిరామల చేపలు.. కిలోకు 40 వరకు తూగుతాయి. కానీ వీటిని పీస్‌ల లెక్క అమ్ముతూ ఉంటారు. సాధారణంగా రామలు ధర ఒక్కోటి రూ.25 వరకు ఉంటుంది. కానీ ప్రారంభ సీజన్‌లో ఒక్కోటి రూ.30కు పైనే పలుకుతుంది. డిమాండ్‌ను బట్టి ఒక్కోసారి రూ.40 నుంచి రూ.50 పలుకుతుంది. ఈ చేపలను మన దగ్గర తినడమే కాకుండా.. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తారు. మసాలా దట్టించి ఇగురు పెట్టినా.. ఇదే సీజన్‌లో కాసే లేత చింతకాయలతో కలిపి పులుసు పెట్టినా.. ఆ రుచి అమోఘం అంటున్నారు మాంసాహార ప్రియులు. చింతకాయలతో కలిపి వీటిని కూర వండితే ఆ వాసన ఊరి పొలిమేర దాటాల్సిందేనట.

# సిబ్బంది కొరతతో ఆలస్యమవుతున్న బ్యాంకు లావాదేవీలు





**వై రామవరం,పెన్ పవర్, నవంబర్ 4 :** బ్యాంకులో సిబ్బంది కొరతతో లావాదేవీలు చేయడం లో ఆలస్యం అవుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్,క్యాషియర్ ఉండడంతో లావాదేవీలు జరుపుటకు ఆలస్యం అవుతుందని అంటున్నారు. నెలలో మొదటి సోమవారం అయితే ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు, ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పెన్షనర్లు రద్దీ అధికంగా ఉండడంతో బ్యాంకు సేవలలో కొంత అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. గతంలో ఇదే బ్రాంచ్ లో మేనేజరు,క్యాషియర్, అసిస్టెంట్ ఉండేవారని ఖాతాదారులు తెలిపారు. బ్యాంక్ అధికారులు స్పందించి ఖాతాదారులకు సకాలంలో సేవలు అందే విధంగా సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

# ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ఎల్ఈడీ లైట్లు పంపిణీ



**వైరామవరం, పెన్ పవర్, నవంబర్ 4 :** యార్లగడ్డ లో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలకు వై. రామవరం ఎంపీటీసీ కే.సుబ్బలక్ష్మి ఎల్ఇడి లైట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ గతంలో కూడా ఉపాధ్యాయుల కోరిక మేరకు ఎల్ఈడి లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థినులు వసతి గృహంలో ఉంటున్నారని అన్నారు. యార్లగడ్డ పంచాయతీ లో ఇండెంట్ పెట్టించి రెండు పెద్దవి,మూడు చిన్నవి ఎల్ఈడీ లైట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థినిలు క్రమశిక్షణతో విద్య నేర్చుకొని ఉత్తీర్ణులు కావాలని పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టాలని అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

**కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్**



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ గ్రామాల్లో పర్యటిస్తూ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. సోమవారం గండేపల్లి మండలంలో సూరంపాలెం, యర్రంపాలెం, నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామల లో టిడిపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుటమి నాయకులందరూ సత్తా చాటాలని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయాన్ని కి కృషి చేయాలని కోరారు. అలాగే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందించే పెళ్లి కానుక, డీఎస్సీ శిక్షణ పై వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను కార్యకర్తలు తెలిపారు. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కుంచే రాజా, జీను మణిబాబు, పాలకుర్తి ఆదినారాయణ, అడబాల వెంకటేశ్వరరావు, అనుకుల శ్రీకాంత్, కుంచె రామకృష్ణ, పోసిన బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవత వాకులమ్మ తల్లి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన

- అత్యధిక సంఖ్యలో అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 4**: ర్యాలి గ్రామ దేవత వాకులమ్మ తల్లి ఆలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి అన్న సమాధానం కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి దేవి నవరాత్రుల మహొత్సవములు పూర్తి చేసుకొని కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భారీ ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో కార్తీకమాసంలో అతి ముఖ్యమైన వంటకం కంద బచ్చలి తో ప్రారంభమై మిల్ మేకర్ బంగాళదుంప కూర, వంకాయి బటాని,పచ్చడి,సాంబారు పెరుగు, రెండు రకాల స్వీట్లు, అరటికాయ బజ్జి తో, వచ్చిన భక్తులకు ప్లేట్ నిండా వడ్డించి కడుపునిండా భోజనం చేసేలా వంటకాలు ఉన్నాయని భక్తులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ వారు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, పురుషులకు ఒకపక్క మరోపక్క స్త్రీలకు భోజనాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి అన్న సమారాధనలో విద్యార్థులు చిన్నారు లు కూడా పాల్గొని అమ్మవారు ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలనే ఉద్దేశంతో వచ్చిన భక్తులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేశామని సుమారు నాలుగు వేల మందికి పైగా అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించాలని అన్నారు.

# వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తప్పవు- జగ్గంపేట సీఐ శ్రీనివాస్



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** జగ్గంపేట సర్కిల్ పరిధిలో వన్యప్రాణులను వేటాడేందుకు అటవీ ప్రాంతాలలో విద్యుత్ తీగల అమరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జగ్గంపేట సిఐ వై.ఆర్.కే శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సర్కిల్ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాలలో ఉన్నటువంటి అటవీ ప్రాంతాలలో వన్యప్రాణులను వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలను అమరచడం జరుగుతుందని అటువంటి వాటిపై ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగల అమరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత భూమి యజమానులపై కూడా చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జంతువుల కోసం ఏర్పాటు చేసి విద్యుత్ తీగల వలన అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని దీనికి కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# మహిళల భద్రతే మహిళా రక్షక్ లక్ష్యం

- జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** మహిళల భద్రత, మహిళలలో అవేర్నెస్ కొరకు కాకినాడ జిల్లా పోలీస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు చేరువగా మహిళా రక్షక్ అనే కార్యక్రమాన్ని జగ్గంపేట సర్కిల్లో సిఐ వైఆర్ కె శ్రీనివాస్, ఎస్ఐల ఆధ్వర్యంలో సోమవారం జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృతంగా నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో సచివాలయ మహిళా పోలీసులు, ఉమెన్ పోలీసులు, పోలీస్ సిబ్బందితో పలుచోట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశాలలో మహిళలకు సంబంధించి చట్టాల పట్ల, వారి యొక్క భద్రత పట్ల పలు అంశాలను వివరించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు మండలాలకు సంబంధించి మహిళా పోలీసులకు మహిళా రక్షక ద్విచక్ర వాహనాలను కాకినాడ జిల్లా పోలీసులు అందజేసినట్లు సిఐ తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరికి జరిమానా, నలుగురికి జైలు


**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** జగ్గంపేట మరియు గండేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుపడిన ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం పెద్దాపురం కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ జి.కృష్ణ శేషచార్య ఇరువురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 20 వేలు జరిమానా, మరో నలుగురికి రెండు రోజులపాటు జైలు శిక్ష విధించినట్లు జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ తెలిపారు. అలాగే జగ్గంపేటలో బహిరంగ ప్రదేశంలో దాగిన ముగ్గురికి రూ.600 చొప్పున రూ.1800 జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు.

# అన్నా కేంటిన్ లో భోజనాలు పెట్టించిన.సత్తిబాబు



**ముమ్మిడివరం పెన్ పవర్ నవంబర్ 4:**తాళ్లరేవు మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిల్లి సత్తిబాబు కుమార్తె పుట్టినరోజు జ్ఞాపకార్థం ముమ్మిడివరం అన్నా కేంటీన్ లో భోజనాలు పెట్టించిన కుటుంబ సభ్యులు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి ,తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్ , దూడల స్వామి నాయుడు,కాశి లాజర్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు.

# ఊర చెరువు సుందరీకరణలో అవినీతి బాగోతం...





- చెప్పిన దానికి చేసిన దానికి పొంతన లేదు....
- ఎమ్మెల్యే ప్రశ్నలతో నీళ్లు నమిలిన అధికారులు...
- ఎమ్మెల్యే నల్లమిల్లి...

**అనపర్తి,పెన్ పవర్,నవంబర్ 4** బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో గత వైసిపి పాలనలో 1.50 కోట్ల రూపాయలతో ఊర చెరువు సుందరీకరణలో భాగంగా భారీ అవినీతి జరిగిందని పలు ఆరోపణలు వెల్లువెత్తడంతో రుడా అధికారులతో కలిసి ఆరోపణలు జరుగుతున్న ప్రదేశాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంబంధిత అధికారులు సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో బలబద్రపురంలో గల ఊరచెరువు సుందరీకరణ పేరున అటు నుంచి చెరువుకి రావలసిన నీళ్లు రాకుండా చేసి చెరువు నుండి వెళ్ళవలసిన నీళ్లు వెళ్లకుండా చేయడంతో మత్స్యకారులు తనకి ఫిర్యాదు చేయడంతో రూడా అధికారులతో సందర్శించడం జరిగిందనన్నారు. చెరువు సుందరీకరణలో భాగంగా కోటి 50 లక్షలు రూపాయలు రూడా నుంచి మంజూరు చేయడం జరిగిందని, వాటి వ్యయ నిర్వహణ తీరును రుడా అధికారులను వివరం కోరగా అధికారులు చెప్పే మాటలకు అక్కడ జరిగిన అభివృద్ధికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి అడిగిన ప్రశ్నలకు అధికారులు నుండి ఏ విధమైన స్పందన లేకపోవడం గమనార్హం. అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం చెరువు సుందరీకరణలో బహిరంగ వ్యాయామశాల వాకింగ్ ట్రాక్ చిన్నపిల్లలు ఆడుకోవడానికి కావలసిన సామాగ్రి అమర్చినట్టు అధికారులు ఇచ్చిన వివరాలు చూసి గ్రామస్తులు నివ్వెరపోయారు.

రూ.1.50 కోట్ల ఊర చెరువు సుందరీకరణ పేరుతో భారీగానే నిధులు స్వాహా చేశారని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అంతే కాకుండా చెరువుకు ఎగువ నుంచి రావలసిన నీరు ఏ విధంగా వస్తుంది చెరువులో ఉన్న నీరు దిగువకు ఏ విధంగా వెళుతుందని ప్రశ్నించారు. విషయం అవగాహన లేకుండానే నిధులు ఎలా మంజూరు చేశారంటూ ఎమ్మెల్యే నిలదీయడంతో అధికారులు బాగోతం బయటపడటమే కాకుండా అధికారులు కూడా గత ప్రభుత్వ నాయకులతో కుమ్మక్కయ్యారని తేటతెల్లమవుతుందన్నారు.

నీతినిజాయితీకి మారుపేరు అని చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి ఏమి సమాధానం చెబుతారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో బలబద్రపురం ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# అదుపుతప్పి పల్టీ కొట్టిన ఆర్టీసీ బస్సు...

- ఒకరిద్దరికి స్వల్ప గాయాలు అంతా సురక్షితం...



**అనపర్తి,పెన్ పవర్,నవంబర్ 4:**అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు అనపర్తి మండలం పులగుర్త సమీపన చెట్టును ఢీ కొట్టి పల్టీ కొట్టింది. సోమవారం ఉదయం జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాకినాడ నుంచి రావులపాలెం వెళుతుండగా పులగుర్త వద్దకు వచ్చే సరికి అదుపుతప్పిన బస్సు రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని, పంట కాలువలోకి పల్టీ పడింది. ఆ సమయంలోబస్సులో 24మంది ప్రయాణీకులు ఉన్నారు. కాగా వారిలో ముగ్గురికి గాయాలయ్యాయి. కే. గంగవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన నూకల వీరభద్రరావు, కాకినాడ మండలం తూరంగికి చెందిన కోటి ఆంజనేయ రాజుకు స్వల్పగాయాలు కాగా, రాయవరానికి చెందిన బొడ్డు సూర్యకళకు తలకు గాయమైంది. దీంతో వారిని అంబులెన్సుపై రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో నూకల వీరభద్రరావు, కోటి ఆంజనేయరాజును చికిత్స అనంతరం డిశార్జ్ చేశారు. బొడ్డు సూర్యకళ తలకు గాయమవడంతో ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించారు. అయితే ఆమెకు ప్రాణపాయమేమిలేదని తెలిపారు. బస్సు ప్రమాద ఘటనపై పూర్తి విచారణ చేసి ప్రమాద కారణాలు తెలుసుకుంటామని రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరావు తెలిపారు కాగా క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు.

# భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు,





**కె గంగవరం పెన్ పవర్, నవంబర్ 4:**కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలో గల అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.కె గంగవరం మండలం కోటిపల్లి లో తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో గౌతమి గోదావరిలో పుణ్యస్నానమాచరించి శివునికి ప్రీతి కరమైన రోజు సోమవారం సందర్భంగా శ్రీ ఛాయా సోమేశ్వరస్వామినీ అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారిని అమ్మవార్లను పువ్వులతో ప్రత్యేక అలంకరించారు ఆలయ ఈవో స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులకు ఏ అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసారు అదేవిధంగా కె గంగవరం మండలం అన్ని గ్రామాల్లో శివాలయంలో హరిహర నామాలతో శివాలయాలు మార్మోగాయి. కె గంగవరం మండలం పాతకోట గ్రామంలో శ్రీ లోపాముద్రంబ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండగండి గ్రామంలో సోమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారం

- నాగారాధనతో జీవావరణ సమతుల్యం
- నేడే నాగులచవితి

**పెద్దాపురం, పెన్ పవర్, నవంబర్ 4 :** దీపావళి అమావాస్య తరువాత వచ్చే కార్తీక శుద్ధ చవితిని "నాగుల చవితి" పర్వదినం అంటారు. నాగుపాముల ఆరాధన ఈనాటి కాదు. యుగాలనాటిది. సౌభాగ్యానికి, సంతానప్రాప్తికి సర్పపూజ చేయడం అనేది చాలా సంవత్సరాలుగా ఉన్నట్లు మన పురాణాలు చెబుతున్నాయి. దీనికి దేశమంతటా పలు దేవాలయాల్లో మెలికలతో ఉన్న ఎన్నో నాగేంద్రుని విగ్రహాలు కన్పించడమే నిదర్శనం. నాగుల చవితినాడు నాగేంద్రుని శివభావముతో అర్చిస్తే సర్వ రోగాలు తొలగిపోయి సౌభాగ్యులవుతారని పండితులు చెబుతున్నారు. సాధారణంగా ప్రకృతికి మనకు ఎంతో అవినాభావ సంబంధము కనిపిస్తూ ఉంటుంది. ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైంది. కనుక దానిని దైవ స్వరూపంగా భావించి నాటి నుంచి నేటివరకు చెట్టును, పుట్టను, రాయిని, రప్పను, కొండను, కోనను, నదిని, పర్వతాన్ని ఇలా సమస్త ప్రాణి కోటిని దైవ స్వరూపంగా పూజిస్తూ వస్తున్నారు. ఇదే తరహాలో విషనాగులు, పాములను కూడా పూజిస్తున్నారు. పాములు భూమి అంతర్భాగమునందు నివసిస్తూ భూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి నీటిని ప్రసాదించే దేవతలుగా ఆనాటి నుంచి నేటివరకు భావిస్తున్నారు. ఇవి పంటలను నాశనం చేసే క్రిమి కీటకాదులను తింటూ పరోక్షంగా రైతుకు పంటనష్టం కలుగకుండా చేస్తున్నాయి. అలా ప్రకృతిపరంగా అవి మనకు ఎంతో సహాయపడుతూ ఉంటాయి.

కంటికి కనిపించే విషనాగు పాములకంటే మానవ శరీరమనే పుట్టలో నిదురిస్తున్న నాగుపాము మరింత ప్రమాదకరమని పెద్దలన్నారు. కాని నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విషసర్ప పుట్టను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విష సర్పం కూడా శ్వేతత్వం పొంది మన అందరి హృదయాల్లో నివసించే మహావిష్ణువునకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా అవుతాడనే కోరికతో చేసేదే ఈ నాగుపాము పుట్టలో పాలు పోయడంలో ఆంతర్యమని పండితులు చెబుతున్నారు. ఇకపోతే కుజ, రాహు, దోషాలున్నవారు, సాంసారిక బాధలున్నవారు ఈ కార్తీక మాసములో వచ్చే షష్ఠీ, చతుర్దశి తిథులలో మంగళవారం నాడు గాని, చతుర్దశి బుధవారం కలిసి వచ్చే రోజున, లేదా నాగుల చవితి రోజున దినమంతా ఉపవాసముండి

పాహి పాహి సర్పరూప నాగదేవ దయామయ సత్సంతాన సంపత్తిం దేహిమే శంకర ప్రియ, అనంతాది మహానాగ రూపాయ వరదాయచ తుభ్యం నమామి భుజగేంద్ర సౌభాగ్యం దేహిమే సదా అంటూ ఆవు పాలును పుట్టలో పోసి చలిమిడి, చిమ్మిలి, అరటిపళ్ళు మున్నగునవి నివేదన చేస్తే అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయని భక్తుల విశ్వాసం. అలాగే నాగుల చవితి రోజున ఈ క్రింది శ్లోకాన్ని



పఠిస్తే కలిదోష నివారణ అవుతుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

కర్కోటకస్య నాగస్య దయయంత్యా నలస్య చ
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనమ్ అంటూ తామర పువ్వులు, కర్పూరం, పువ్వులతో సర్పారాధన చేసి, లడ్డూ నైవేద్యం పెడితే వారి వంశం తామరతంపరగా వర్ధిల్లుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఇకపోతే మనదేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇలవేల్పుగా సుబ్రహ్మణ్యస్వామిని పూజిస్తారు. ఆయన అందరికి ఆరాధ్యదైవం కాబట్టి వారి పేరును నాగరాజు, ఫణి, సుబ్బారావు వగైరా పేర్లు పెట్టుకుంటున్నారు. అంతేకాదు తమిళనాడులోని నాగర్‌కోయిల్ అనే ఊరిలో నాగుపాము విగ్రహం ఉంది. దాని సమీపంలో ఆరు నెలలు తెల్లని ఇసుక, ఆరు నెలలు నల్లని ఇసుక భూమిలో నుంచి ఉబికి పైకి వస్తుందని భక్తులు చెప్తూ ఉంటారు. ఇదిలా ఉంటే నాగుపాము కుబుసానికి కూడా మంచి ఆయుర్వేద గుణాలు ఉన్నాయని, గరళాన్ని ఆయుర్వేద మందులలో తగుమోతాదులతో ఉపయోగిస్తారని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది.

వ్రతం ఆచరించే పద్ధతి / పూజ చేయు విధానం: నాగులచవితి రోజున ఉదయాన్నే లేచి తలంటు పోసుకొని ఇంట్లో దేవుని వద్ద దీపారాధన చేయాలి. ఎరుపు రంగు దుస్తులు ధరించాలి. తర్వాత పూజామందిరము, ఇంటిని శుభ్రం చేసుకోవాలి. గడపకు పసుపు, కుంకుమ, గుమ్మానికి తోరణాలు, పూజా మందిరాన్ని ముగ్గులతో అలంకరించుకోవాలి. పూజా మందిరంలో కలశమును ఏర్పాటు చేసి దానిపై ఎరుపు వస్త్రాన్ని పరుచుకోవాలి. నాగేంద్రస్వామి ప్రతిమనుగానీ, లేదా ఫోటోనుగానీ పూజకు ఉపయోగించాలి. పూజకు మందారపూలు, ఎర్రటి పువ్వులు, కనకాంబరములు నైవేద్యమునకు చిన్నచిన్న ఉండ్రాళ్ళు, వడపప్పు, అరటిపండ్లు, చలిమిడిలను సిద్ధం చేసుకోవాలి. పూజకు ముందు నాగేంద్ర అష్టోత్తరము, నాగేంద్ర స్తోత్రము, నాగస్తుతిః, నాగేంద్ర సహస్ర నామములను పఠించడం ద్వారా సకలసంతోషాలు ప్రాప్తిస్తాయని విశ్వాసం. స్తోత్రములు పఠించేందుకు వీలుకాని పక్షములో "ఓం నాగేంద్రస్వామినే నమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. దీపారాధనకు నువ్వులనూనెను వాడాలి. 7 దూదివత్తులు, ఆవునేతితో సిద్ధం చేసుకున్న దీపముతో హారతినిచ్చి నైవేద్యమును సమర్పించుకోవాలి. పూజ ముగిశాక నాగేంద్ర స్వామి నిత్యపూజ అనే పుస్తకమును తాంబూలముతో చేర్చి ముత్తైదువులకు అందజేయాలి. తరువాత దగ్గరలో ఉన్న పుట్టవద్దకు పోయి దీపం వెలిగించి పుట్టలో పాలుపోసి పూజ చేయాలి. పూజ అయిన తరువాత నైవేద్యం పెట్టి ఆ రోజు పగలంతా ఉపవాసం ఉండి రాత్రికి భోజనం చేయాలి. ఇది వ్రతం ఆచరించే పద్ధతి. నాగుల చవితి రోజున నాగదేవతలకు పంచామృతములతో అభిషేకం చేయిస్తే సర్వం సిద్ధిస్తుందని నమ్మకం. అలాగే దేవాలయాల్లో నాగేంద్ర అష్టోత్తర పూజ, నాగేంద్ర సహస్రనామ పూజలు చేయించడం శుభదాయకం. ఇంకా మోపిదేవి ఆలయం, నాగేంద్రస్వామి పుట్టలను నాగుల చవితి రోజున సందర్శించేవారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తవుతాయని పండితులు అంటున్నారు. చెవిబాధలు, కంటిబాధలు ఉన్నవాళ్లకు చవితి ఉపవాసం మంచిది. నాగవస్త్రాలు పుట్టమీద పెట్టి తీసి ధరిస్తే మనోరథాలు తీరుతాయి. అందుచేత నాగుల చవితి రోజున నాగరాజును నిష్ఠతో పూజించి ఆయన అనుగ్రహం పొందుదుముగాక...

## గుర్తు తెలియని దుండగులు బంగారం చోరీ

పోలీస్ స్టేషన్ ని ఆశ్రయించిన బాధ్యతులు

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 4:** గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో చొరబడి బీరువాలో ఉన్న నాలుగు కాసుల బంగారం దొంగిలించిన సంఘటనర్యాలి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొచ్చుల లక్ష్మీ దుర్గ,భర్త నారాయణరావు పచ్చళు ్ళ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు.ఆదివారం మధ్యాహ్నం12 గంటల సమయంలో గ్రామంలో అయ్యప్పస్వామి బోజనం నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి ఇంటి బీరువాలో ఉన్న నాలుగు కాసులు బంగారం దొంగలించారని బాధ్యతరాలు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేయగా ఎస్సై ఎస్.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## శ్రీ ఉమాకమండలేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిట

- శివనామ స్వరాలతో మారుమోగిన ఆలయం





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 4:** ఆధ్యాత్మిక కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో అతి పురాతనమైన దేవాలయం 11 శతాబ్దం నాటి చోళు ్ళల పరిపాలన కాలంలో నిర్మించిన శ్రీ ఉమాకమండలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వేకువ జాము నుండే శివనామ స్వరాలతో మారుమోగాయి. ఆలయం అంత సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మిరిమిట్లు కురిపించేలా విద్యుత్ దీపాలతో ఆలయానికి వచ్చిన భక్తులను ఆకట్టుకుంది. ఓం నమఃశివాయ హరహర మహా దేవ శంభో శంకర అంటూ భక్తులు భక్తి శ్రద్ధలతో ఆది దేవుడిని పుజించారు. స్వయంభు క్షేత్రం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించుకున్నారు. అర్చకులు

గౌరి శంకరశర్మ స్వామి వారికి పంచా మృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యులైన్లు కిక్కిరిసిపోయాయి. దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి భక్తి ని చాటుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి బి. వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

## అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి




**పెద్దాపురం, పెన్ పవర్, నవంబర్ 4 :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయ ఏవో కె.వి. మాధవరావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోపు పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం తొమ్మిది అర్జీలు అందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు

గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు షురూ


దేశ విదేశాల నుంచి గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు

ఈ సారి పుష్కరాల కోసం ఎనిమిది కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా

సిటీ బ్యూటిఫికేషన్, ఐకానిక్ టూరిజం సైట్ ప్రాజెక్టు కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదన

పుష్కర ఏర్పాట్ల పైన కీలక కసరత్తు

ఇప్పటి నుంచే రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు



**బ్యూరోరిపోర్ట్ పెన్ పవర్ ఉభయ గోదావరి, నవంబర్ 4:**
కోట్లాది మంది పవిత్రంగా భావించే గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారైంది. దేశ విదేశాల నుంచి గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. గోదావరి పుష్కరాలకు అంతా సిద్ధమవుతుంది. ఇంకా రెండేళ్లకు పైగానే సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రభుత్వం పుష్కరాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం ప్రారంభిస్తుంది. భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలగకుండా ఉండేలా అన్ని సౌకర్యాలతో పాటు భక్తులకు అన్ని రకాలుగా ఏర్పాట్లను చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. చేపట్టాల్సిన పనుల పైన నిర్ణయానికి వచ్చారు. ఈ సారి గోదావరి పుష్కరాలు2027 జూల్కై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి పుష్కరాలు జరుగుతాయి. నదీ పుష్కరాలు పన్నెండేళ్లకు ఒకసారి అన్ని నదులను పూజించడం మన సంప్రదాయంగా వస్తుంది. అందులో భాగంగానే నదులకు హారతులివ్వడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాల సమయంలో అందులో స్నానమాచరిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అందుకే పుష్కరాల కోసం భక్తులు కళ్లకు వత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తుంటారు. ఈ సారి పుష్కరాల కోసం ఎనిమిది కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తుంది. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తుంది. గోదావరి జిల్లాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో ప్రతిపాదలు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. సుమారు రెండున్నరేళ్ల కంటే ఎక్కువ సమయం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి నుంచే పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. పుష్కర ఏర్పాట్ల పైన కీలక కసరత్తు చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులు అందరూ ఒకే ఘాట్‌లో స్నానాలు చేసే అవసరం లేకుండా గోదావరి నదిలో ఎక్కడ్కెనా స్నానాలు చేయొచ్చని ప్రచారం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది వస్తారని అంచనా వేస్తున్నారు. మరో నాలుగు కొత్త ఘాట్లు అవసరమని అధికారులు గుర్తించారు. అలాగే వచ్చిన భక్తుల కోసం వసతి సదుపాయాలను కూడా గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానంగా ఎక్కువ మంది భక్తులు గోదావరి పుష్కరాలు అంటే రాజమండ్రికి ఎక్కువ మంది వస్తా?రు. అందుకోసం రాజమండ్రి నగర పరిధిలో గోదావరి ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. కార్పొరేషన్ రోడ్ల అభివృద్ధికి రూ.456.5 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి రూ.678.76 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. సిటీ బ్యూటిఫికేషన్, ఐకానిక్ టూరిజం సైట్ ప్రాజెక్టు కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదించారు. ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా తీసుకుని శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది.

# గణిత మేధావి శకుంతలాదేవి సేవలు ఆదర్శనీయం



**సామర్లకోట, పెన్ పవర్, నవంబర్ 4:** హ్యూమన్ కంప్యూటర్ గా పేరొందిన శకుంతలా దేవిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. గణిత మేధావి శకుంతలా దేవి జయంతి సందర్భంగా గణిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిరామకృష్ణ మాట్లాడుతూ గణిత మేధావి, బహుగుణ ప్రజ్ఞాశాలి శకుంతలా దేవి పట్టుమని పదేళ్లు కూడా లేని వయసులోనే లెక్కల్లో అసాధారణమైన ప్రతిభ కనపరిచేవారన్నారు. అంకగణితంలో రెప్పపాటులో లెక్క తేల్చడం ఆమెకే సాధ్యమని మైండ్ డైనమిక్స్ అనే సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసిన శకుంతలా దేవి కంప్యూటర్ ముందు మానవ మేథస్సు ఎంతో గొప్పదని చెప్పేవారన్నారు. కంప్యూటర్లను ఓడించడం ఒక లెక్క కాదంటూ నిరూపించారని, ఆమె ఎంత పెద్ద అంకె అయినా సెకండ్లలో పరిష్కరించడం, నోటితో సమాధానం చెప్పేయడం ఆమె ప్రత్యేకతని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితంలో పలు మెళకువలు, సులువైన పద్ధతులతో గణన పద్ధతులు వివరించారు. గణితంలో పట్టు సాధించడం ద్వారా తమ జీవితాలను లెక్క ప్రకారం చక్కదిద్దుకోవచ్చని విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.వి.ఆర్.ఎన్ వల్లి, ఏ.శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవ స్వామికి విరాళం





కార్తీక మాసం ఆలయానికి పోటెత్తిన భక్తులు

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 4:** ర్యాలి గ్రామం లో వెలిసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని స్వామి, గోపాల స్వామి ఆలయం ఈ ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తుల తరలిస్తారు. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుండి భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు అన్నదాన పథకానికి విరాళం సమర్పించారు. విశాఖపట్నంనికి చెందిన వేగిరాజు కాశీ విశ్వనాధరాజు శ్రీదేవి దంపతులు స్వామి వారి అన్నదాన పథకమునకు 10,000 రూపాయలు విరాళం అందించారు. తణుకు పట్టణానికి చెందిన కొడవలి హైమావతి తన బంధువు శేషావతారం జ్ఞాపకార్థం స్వామి వారి అన్నదాన పథకానికి 10,116 రూపాయలు విరాళంగా సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి. వెంకటరమణమూర్తి స్వామి వారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

# జలా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ కు 290 అర్జీలు



**కాకినాడ.పెన్ పవర్ నవంబర్ 4 :**ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు,హౌసింగ్ పీడీ ఎన్వీవీ.సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, పౌరసరఫరాల శాఖ అధికారి ఎంవీ.ప్రసాద్,బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి ఇతర అధికారులు హాజరై, ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు.ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.రెవిన్యూ,పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు,ఉద్యోగ ఉపాధి అవకాశాలు,టిడ్కో గృహాలు,ఇళ్ల స్థలాలు,భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు,డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం-290అర్జీలు అందాయి.ఈ సందర్భంగా డీఆర్వో జె.వెంకటరావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.వివిధ శాఖలకు అందిన వినతులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోపు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## జల ఉత్సవ్ కార్యక్రమం పై మండల స్థాయి సమావేశం



**వై రామవరం, పెన్ పవర్,నవంబర్ 4 :** అధికారుల ఆదేశాల మేరకు జల ఉత్సవ్ మండల స్థాయి కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి కే.బాపన్న దొర తెలిపారు.

ఈ కార్యక్రమం ఈనెల 6వ తేదీ నుండి ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏడవ తేదీ నుండి 20వ తేదీ వరకు అన్ని పంచాయితీలలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి ఈవో( పి ఆర్ అండ్ ఆర్ డి ) శివకుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మణికంఠ, మండల విద్యాశాఖ అధికారి కె. తాతబ్బాయి దొర, అప్పర్ పార్ట్ ఏపీవో స్వామి, లోయర్ పార్ట్ ఎపిఓ సాయిబాబా, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారని తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఉల్లాస్ పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కమిషనర్ భావన



**కాకినాడ.పెన్ పవర్ నవంబర్ 4 :**డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా సుమారు 15 మంది ఫోన్ చేసి తమ సమస్యలను ఆధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.వారి సమస్యలను స్వయంగా విని.. పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా పలు సమస్యలపై సుమారు 30 వరకు అర్జీలు అందాయి.పలువురు కాంట్రాక్టర్లు కూడా నేరుగా కమిషనర్‌కు బిల్లుల చెల్లింపు విషయమై అర్జీలు అందజేశారు. వాటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీల్లో కాకినాడ క్రీడాకారుడు




**కాకినాడ.పెన్ పవర్ నవంబర్ 4 :**జాతీయస్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్బాల్ టోర్నీకి కాకినాడ జిల్లా క్రీడాకారుడు ఎస్ ప్రేమ్ నాథ్ ఎంపికయ్యారు.ఇటీవల గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరిగిన సంతోష్ ట్రోఫీ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలలో కాకినాడ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన ఎస్ ప్రేమ్ నాథ్ రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించి జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు.ఈ సంధర్భంగా కాకినాడ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్ రావూరి మాట్లాడుతూ కాకినాడ జిల్లా నుండి యువ క్రీడాకారుడు ప్రేమ్ నాథ్ రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు అనంతపురం ఆర్.డి.టి క్రీడ మైదానంలో జరగనున్న జాతీయస్థాయి సీనియర్ మెన్ సంతోష్ ట్రోఫీ ఫుట్బాల్ పోటీలలో ప్రేమ్ నాథ్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మేరకు యువ క్రీడాకారుడు ప్రేమ్ నాథ్ ను, జిల్లా ఫుట్ బాల్ కోచ్ కోరుమిల్లి స్వామి శ్రీనివాస్ ను రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కోటగిరి శ్రీధర్, కాకినాడ జిల్లా అధ్యక్షులు సంతోష్ రాపేటి, కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ అభినందించారు.

## బకాయి జీతాలు చెల్లించాలి



● కమిషనర్ కు సిఐటియు వినతి

**కాకినాడ,పెన్ పవర్ నవంబర్ 4 :**కాకినాడ నగరపాలక సంస్థ వాటర్ ట్యాంక్ డ్రైవర్స్ కు మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సోమవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ భావనకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా విభాగంలో వాహనాలు, వాహనాలకు అవసరమైన ఇంధనం ఏర్పాటు కార్పొరేషన్ నిర్వహిస్తున్నప్పుడు,జీతాలు చెల్లింపుకు థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ సమంజసం కాదన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం డ్రైవర్లకు కనీస వేతనం 24,500 రూపాయలు చెల్లించాలని, ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు, పబ్లిక్ సెలవులు అమలు చేయాలని కమీషనర్ ను కోరారు. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ భావన స్పందిస్తూ జీతాలు చెల్లిస్తామని, వికాస ద్వారా జీతాలు చెల్లింపునకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ భావన స్పందన పట్ల సిఐటియు తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ ట్యాంక్ డ్రైవర్స్ పవన్, మల్లేశ్వరరావు ,వెంకటేష్, సురేష్ ,నరేష్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక సమస్య పరిష్కరించండి



**పెనుమంట్ర,పెన్ పవర్,నవంబర్-03:**మండలంలోని ఆలమూరు స్మశాన వాటిక కొరకు మండల మాల మహానాడు అధ్యక్షుడు కుసుము వెంకటేశ్వరరావు సోమవారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రాలు పరిశీలించి గత 100 సంవత్సరములుగా ఆలమురు గ్రామం ప్రజలకు దళితులకు స్మశాన వాటిక లేకపోవడం వల్ల సదరు ఓడూరు గ్రామం నక్కల పుంత బోధి పక్కన ఖననం చేయుచున్నారని ఫిర్యాదుల పేర్కొన్నారు. కొన్ని కారణాలవల్ల ఓడూరు వారు డంపింగ్ యార్డ్ చేసి అక్కడ ఖననం చేసుకోకుండా చేస్తున్నారని,.కావున గత పది సంవత్సరముల నుంచి తహసిల్దార్ కు కలెక్టర్ కు, ఆర్డిఓ కు వినతి పత్రాలు అందజేస్తూ ఉన్నారు కానీ ఇప్పటివరకు స్పందించలేదని అన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 24 తేదీన ఆలమూరు అంబేద్కర్ సెంటర్లో ధర్నా కూడా చేసినట్లు తెలిపారు.మూడవ రోజున ఆర్డీవో వచ్చి ఈ సమస్యను పరిష్కారం చేయాలని ఎక్కడైనా రెండు ఎకరాలు భూమి ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సదరు ఓడూరు లో నక్కల పుంతలో స్మశాన వాటికను శుభ్రం చేయించి కర్రలు పాతి బరకం కట్టారు అని తెలిపారు. ఈ సమస్యను పరిశీలించి స్మశాన వాటిక ఇచ్చేవరకు ఆ స్మశాన వాటికి కంచి వేసి, చుట్టు ఫినిషింగ్ వేసి గుడిసెలను తొలగించమని ఆలమూరు దళిత ప్రజలు కోరుచున్నారని తెలిపారు.

## ప్రత్యేక పంచాయతీ కావాలని ఆర్.డి.ఓ కీ వినతి పత్రం

ప్రత్యేక పంచాయతీ వల్లనే గ్రామ అభివృద్ధి.



**కొత్తపేట, పెన్ పవర్, నవంబరు4:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, కొత్తపేట మండలం , పలివెల గ్రామపంచాయతీ శివారు పూజారిపాలెం గ్రామానికి ప్రత్యేక పంచాయతీ కావాలని జిల్లా కలెక్టర్ కు ,ఆర్.డి.ఓ. ఎమ్.ఆర్.ఓ, ఎమ్.పి.డి.ఓ అధికారులకు పూజారిపాలెం గ్రామ ప్రజలు సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా బిఎస్పి నియోజకవర్గ సెక్రటరి కుసుమే సురేష్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాల పైబడినా ఇప్పటికీ పూజారిపాలెం గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని,ఎటువంటి గుర్తింపు అనేది లేదని, గ్రామంలో ఇప్పటికీ సరైన రోడ్లు, సరైన డ్రైనేజీ సదుపాయం, సరైన విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు లేవని, పూజారిపాలెం గ్రామ ప్రజలు పంచాయతీ వద్దకు రావాలంటే 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలివెల రావాల్సి వస్తుందని,గ్రామంలో జనాభా శాతం కూడా ఎక్కువగా ఉన్నారని. ప్రత్యేక పంచాయతీ వల్లే పూజారిపాలెం గ్రామ ప్రజలకు అన్ని సౌకర్యాలు వీలుగా కల్పించబడతాయి అని ఆయన అన్నారు. ప్రత్యేక పంచాయతీ వల్ల మా గ్రామాన్ని మేమే పరిపాలించుకుంటామని తెలియజేశారు. కాబట్టి సంబంధించిన అధికారులు పూజారిపాలెం గ్రామానికి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కాంగ్రేగుల గంగరాజు,టి. సందీప్,వి.రమేష్, పి.వెంకటేష్ బిఎస్పి నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ నెల్లి మహేష్ ,గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.

## కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి



**కాజులూరు,పెన్‌పవర్,నవంబర్4:**రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,పోలిశెట్టి చంద్రశేఖర్‌ల పిలుపు మేరకు రామచంద్రపురం నియోజకవర్గం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాజులూరు మండల జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న ఆధ్వర్యంలో కూటమి నేతలతో సమావేశం అయ్యారు.ఈసందర్భంగా బొండా వెంకన్న మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కోలంక గ్రామంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి,పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.గడువు సమీపుస్తుంది, 6వతేదీ చివరి రోజు కావడంతో మూడు పార్టీలకు చెందిన కూటమి సభ్యులు సమావేవం అయి ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపంచేందుకు కూటమి సభ్యులు త్వరితగతిన గ్రామాల్లో ఓటు నమోదు చేయించి , కూటమి అభ్యర్థి విజయానికి కృషిచేయాలని ఆయన సూచించారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పేపకాయల నారాయణరావు (బాబ్జి) ,బీజేపీ సలాది వీరబాబు,సలాది సాయిబాబు,తలాటి అమ్మాజీ,వనుం వీరబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్



వివిధ శాఖల, అధికారులతో.

**అమలాపురం పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్,నవంబర్ 4:** ఈనెల 5వ తేదీ (రేపు) మంగళవారం జరగనున్న జిల్లా సమీక్ష మండలి సమావేశానికి అసెంబ్లీ నియోజ కవర్గాల వారీగా వివిధ శాఖలు ఆయా శాఖల కార్యకలాపాలు మరియు సంబంధిత పథకాలు అమలు తీరుపై నివేదికలు స్పష్టతతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కొరకు సిద్ధం చేయా లని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికా రులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు వివిధ శాఖల అధికా రులతో జిల్లా సమీక్ష మండలి సమావేశ నిర్వహణపై ముందస్తు సమీక్ష జిల్లా కలెక్టర్ నిర్వ హించారు. తొలుతగా జలవనుల శాఖ కార్యక్రమాలపై సమీక్షించి ఖరీఫ్ రబీ సీజన్లో సాగునీరు పంపిణీ మరమ్మత్తు పనులు ఆపరేషన్ నిర్వహణ నిధులు వినియోగం పంట కాలువలు డ్రైనేజీల్లో పూడికతీత పనుల నిర్వహణ వాటి గూర్చి సమీక్షించారు. అనంతరం వ్యవసాయ శాఖ రెండు సీజన్లలో సాగు విస్తీర్ణం, విత్తనాలు, ఎరువులు సరఫరా సీసీఆర్సీ కార్డులు జారీ, పంట రుణాలు కల్పన వంటి కార్యకలాపాలపై నియోజ కవర్గాల వారీగా నివేదిక లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉద్యాన శాఖ ద్వారా మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ హార్టికల్చర్ మరియు రాష్ట్రీయ కృషి వికాస యోజన, వంటి అభివృద్ధి పథక అంశాలు వాటి ద్వారా కల్పించే రాయి తీలపై నివేదికలను రూపొందించాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మెరు గైన ప్రయోజనాలు పొందే విధంగా చర్యలు గైకొన డంతోపాటు 15% వృద్ధి రేటు సాధన వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. గనులు భూగర్భ శాఖ కార్యక్ర మాలపై సమీక్షించి ఉచిత ఇసుక పాలసీ 2024 విధివిధానాలు ప్రస్తుతం సవరించిన ఉచిత ఇసుక పాలసీ ద్వారా ఇసుక సరఫరా కొరకు తీసుకుం టున్న చర్యలు, అందు బాటులో ఉన్న ఇసుక రీచులు సీఆర్జెడ్ పరిధి వంటి అంశాలపై మ్యాప్ల తో సహా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశిం చారు. మాన్యువల్ సెమీ మెకనైజ్డ్ రీచుల వివరా లతో అలాగే సిబ్బంది వివరాలను తెలుపుతూ నివేదికలు పవర్ పాయిం ట్ ప్రజెంటేషన్ కొరకు సిద్ధపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి, జల వనరుల శాఖ సూపరిం టెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, కార్యని ర్వాహక ఇంజనీర్ బి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బోసుబాబు, జిల్లా ఉద్యాన అధికారి బి.వి.రమణ, గనుల భూగర్భ శాఖ రియాల్టీ ఇన్స్పెక్టర్ టి.సుజాత, జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డి నేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మన సాహితీ, సంస్కృతులను కాపాడుకోవాలి..







ఎమ్మెల్యే నల్లమిల్లి...

**అనపర్తి,పెన్ పవర్,నవంబర్ 4:**మన సాహితీ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనపర్తిలో శ్రీ రామిరెడ్డి మంగయమ్మ కళావేదిక వద్ద శ్రీ రాధాకృష్ణ ట్రస్ట్ మరియు టిడిపి నాయకులు చింతా ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ రాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్ర వారి కూచిపూడి భూమాకలాపం నృత్యరూపం మరియు సనాతనధర్మ%శీ%గా మరికొన్ని అంశముల ప్రదర్శన కార్యక్రమాన్ని రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా భారత దేశ చరిత్రను, సంస్కృతిని ఆకలింపు చేసుకుని పనిలో ఉంటే మన యువత మాత్రం పాశ్చాత్య పోకడల వైపు దృష్టి పెడుతుందని అది దురదృష్టకరమన్నారు. మన చరిత్ర సంస్కృతులు చాలా బలీయమైనవని మనిషి యొక్క జీవన గమనానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ భామాకలాపం చేసిన చిన్నారులు అభినందనీయమంటూ రామకృష్ణారెడ్డి దంపతులు ఆశీర్వచనాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అనపర్తి టౌన్ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల ధర్నా





**గంగవరం, పెన్ పవర్, నవంబర్ 4:**మండలంలోని గంగవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాల్సిందేనని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, ఉపాధ్యక్షులు శాంతిరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఈ ధర్నా కార్యక్రమానికి వారు హాజరై తమ మద్దతును ప్రకటించారు .ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం గ్యాస్ నిమిత్తం 300 రూపాయలు మాత్రమే ఇస్తుందని కానీ తాము 1100 రూపాయలు పెట్టి గ్యాస్ కొనుగోలు చేయవలసి వస్తుందని ప్రభుత్వమే నేరుగా గ్యాస్ సరఫరా చేయాలని లేని పక్షంలో కట్టెల పొయ్యి పై వంట చేయడానికి అనుమతిని ఇవ్వాలన్నారు. అలాగే ఐసిడిఎస్ అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. నెలలో ఒక్కసారి మాత్రమే ప్రాజెక్ట్ మీటింగ్లు పెట్టాలని, సెక్టర్ మీటింగ్లు పెట్టాలని సమావేశాలు హాజరైన సిబ్బందికి టీఏ,డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సెల్ సిగ్నల్ లేకపోవడంతో సమీపంలోని సిగ్నల్ ఏరియాలోకి వెళ్లినప్పుడు ఉన్నతాధికారులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బంది కి మెమోలు ఇచ్చి జీతాలు కట్ చేస్తున్నారని ఈ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన బిల్లులను మండల స్థాయి కార్యాలయంలో అందజేసినప్పటికీ బిల్లులు కనిపించడం లేదంటూ పలుమార్లు కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రీ స్కూల్ అటెండెన్స్ ఉదయం 10 గంటల లోపు సిగ్నల్ లేని ఏరియాలో ఎలా నమోదు చేయాలని వారు ప్రశ్నించారు. చీడి పాలెం, జడేరు అంగన్వాడి కేంద్రాల సిబ్బందికి కట్ చేసిన జీతాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే సరుకులు సక్రమంగా తూకాలు రావడంలేదని బియ్యం బస్తా కి ఐదు కేజీలు తగ్గుతున్నాయని వారు ఆరోపించారు. ప్రభుత్వ సెలవు దినాల్లో పనులు చేయాలని ఒత్తిడి చేయరాదని ,కేంద్రాల తనిఖీ ల సమయంలో అనారోగ్యంగా ఉన్న సిబ్బందిని రాజీనామాలు చేయాలని ఒత్తిడి తేవడం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని సిడిపిఓ లక్ష్మికి అందజేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీల జిల్లా కార్యదర్శి నిర్మల ,ప్రాజెక్ట్ అధ్యక్షురాలు నాగదేవి, కార్యదర్శి రాణి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్ నవంబర్ 4 :**రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హితవు పలికారు.గోపాలపురంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని ఎండబెట్టి తేమ శాతం లేకుండా చూసుకోవాలన్నారు.అలాంటి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే ప్రభుత్వం ప్రకటించిన ధర పొందవచ్చుని సూచించారు.అలాగే రైతులకు కావలసిన గోను సంచులను సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రానికి ముందు తేమ శాతం కొలిచే యంత్రాన్ని ప్రారంభించి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్లపాటి రాము,వడ్లమూడి రమేష్,జ్యేష్ట శ్రీధర్,మద్దిపాటి రమేష్,ఏవో రాజారావు తదితరులు ఉన్నారు.

## సముద్రునికి కార్తీక పూర్ణకుంభ హారతి



**కాకినాడ రూరల్,పెన్పవర్,నవంబర్4:**కోటివత్తులతో సముద్రునికి కార్తీక "కుంభ హారతి" జైగణేశ్వర! జయము జయము పరమేశ్వర!! క్రోధినామసంవత్సర కార్తీకమాస తొలి సోమవారం సందర్భం గా కాకినాడ స్వయంభూ భోగి గణపతి పీఠం ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ వాకలపూడి సూర్యా రావు పేట సముద్ర తీరం నందు సుప్రభాత వేళలో సముద్రునికి కోటివత్తులతో కార్తీక పూర్ణకుంభ హారతిని సనాతన రీతిలో శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగింది. శ్రీవారి సేవా సమాజం సభ్యులు కలశ ప్రతిష్ట పసుపు కుంకుమలతో అష్టోత్తర పూజ పంచామృత అభిషేకం చేపట్టి సముద్ర జలాల్లోకి పట్టు వస్త్రంతో మంగళకర సంకీర్తనల నడుమ నైవేద్య నివేదనలు సమర్పించారు. విష్ణు శివ లలితాదేవి సహస్ర స్తోత్రనామ పారాయణ నిర్వర్తించి హారతులం దుకున్నారు. స్వయంభు వెలిసిన తీరాల్లో అక్కడి పీఠం ఉపాసకులు సముద్రు నికి పూర్ణకుంభహారతి తో ఆరాధన చేయడం సనాతన సంప్రదాయ మని విశ్వసంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ప్రకృతిని పర్యావరణా న్ని భగవంతుని స్వరూపంగా ఆరాధించాలని పాల సముద్రం నుండి అమృత వైభవం ఆవిర్భవించిన క్షీర సాగర మధనం ఇందుకు సంకేతంగా భోగి గణపతి పీఠం తెలియజేసింది.

## భక్తులతో పోటెత్తిన ఉమా కొప్పేశ్వర స్వామి ఆలయం





**కొత్తపేట పెన్ పవర్ నవంబర్ 4:**కార్తీక మాసం పర్వదినం మొదటి సోమవారం కావడంతో శైవక్షేత్రాలలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఈసందర్భంగా కొత్తపేట మండలం పలివెల గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుండే శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.ఓం నమఃశివాయ హరహర మహా దేవ శంభో శంకర అంటూ ఓంకార నాధాలతో భక్తి శ్రద్ధలతో భక్తులు ఆది దేవుడిని పుజించారు.ఆలయ అర్చకులు స్వామి వారికి భక్తులు నుంచి స్వీకరించిన పంచా మృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యులైన్లు కిక్కిరిసిపోయాయి.దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు.మహిళలు కార్తీక దీపాలను వెలిగించి భక్తుని చాటారు.ఆలయ కార్య నిర్వహణ అధికారి సోమాల శివ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## భూ సమస్యల పరిస్కారం కోసమే రెవెన్యూ సభలు.-తాహసిల్దార్ ప్రకాష్ బాబు.




**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 04:**భూ సమస్యలపై రైతులు వేగంగా స్పందించి గ్రామ రెవెన్యూ సభలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ కె.జె.ప్రకాష్ బాబు అన్నారు. మండలంలోని నర్సిపూడి పంచాయతీ వద్ద ఆయన ఆధ్వర్యంలో సర్పంచ్ కండిబోట్ల శ్రీను అధ్యక్షతన సిబ్బందితో గ్రామ రెవెన్యూ సభ శనివారం నిర్వహించారు.ఇందులో రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు దరఖాస్తుల రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఐదు రకాలుగా ఉన్నాయన్నారు. అవి జాయింట్ ఫీల్డ్ విభజన, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ ముటేషన్, విస్తీర్ణం నందు వ్యత్యాసం, సర్వేనెంబర్ కొర్లేషన్ సవరణగా ఉన్నాయి. వీటి కొరకు ఫిర్యాదుదారులు దరఖాస్తుల రూపంలో అందజేయగా స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దునే స్వామి నాయుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు రాయుడు బాబ్జి, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, కూటమి నాయకులు ఉండమట్ల బాలాజీ, ఆర్ఐ రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి కె.కృష్ణ, వీఆర్వో ఏసు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవన్ నవంబర్ 4 :**వాహనదారులకు నాణ్యమైన ఇంధనాన్ని అందించవలసిన అవసరం ఎంతైనా ఉందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.నియోజకవర్గంలోని ఎర్నగూడెం గ్రామంలో శ్రీ వేణుగోపాల సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను ఎమ్మెల్యే మద్దిపాటి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల ద్వారా పెట్రోల్ బంక్ ని ఏర్పాటు చేస్తే వినియోగదారులకు స్వచ్ఛమైన పెట్రోల్ డీజిల్ అందించవచ్చున్నారు.ఇటువంటి బంకులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతవాసులకు ఈ బంకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, సామాజిక వేత్త పెనుమత్స సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

## అమ్మవారికి వెండి పాదుకలు బహుకరణ



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 04:**మండలంలోని చెముడులంక గ్రామంలో (గాంధీనగరం) జాతీయ రహదారి చెంతన ఉన్న దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి ఆ గ్రామానికి చెందిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చోడిశెట్టి చంద్రశేఖర్ పద్మలీల దంపతులు వెండి పాదుకలు బహుకరించారు. ఈ మేరకు సోమవారం ఆలయ నిర్వాహకులకు వాటిని అందించి భక్తుల దర్శనార్థం ఆలయంలో అలంకరించారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మద్యం దుకాణం.. నిరసన గళం..!

- నివాసాల చెంత దుకాణం ఏర్పాటు తగదంటూ ఆందోళన
- ఏర్పాటు చర్యలు మానుకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం



**పోడూరు, పెన్ పవర్, నవంబర్ -4:** పెనుమదం లేఅవుట్లో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ఉద్యమం ఉదృతం చేస్తామని, నివాసాల చెంతకు దుకాణం ఏర్పాటు చర్యలు తగవంటూ మహిళలు, గ్రామ పెద్దలు, విద్యార్థినులు, స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. పెనుమదం గుమ్మలూరు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్లో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తారన్న సమాచారంతో సోమవారం ఆ లేఔట్ వద్ద మద్యం దుకాణాన్ని పెట్టొద్దని పైడావ 1,2, తోటమేరక, కేతవారిపాలెం, దుర్గమ్మ చెరువు, ముత్తోట చెరువు, కుంచేవారిపాలెం సంఘాలకు చెందిన సుమారు 100 మందికి పైగా నిరసనకారులు పెనుమదం, పైడావ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలకు చెందిన సంఘ పెద్దలు, మహిళలు, విద్యార్థులు మాట్లాడుతూ పెనుమదం, గుమ్మలూరు సరిహద్దు కాలనీలు ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగిస్తున్నామని స్థానికంగా మద్యం దుకాణాన్ని ప్రధాన రహదారి పక్కన పెట్టడంతో ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెనుమదం నుంచి ఈ కాలనీలకు రాకపోకలు సాగించే సమయంలో మందుబాబులు ఆగడాలకు అడ్డాగా మారుతుందన్నారు. సాయంత్రం, రాత్రి వేళలో మహిళలు, విద్యార్థులు రహదారి వెంట వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యం చేసుకుని మద్యం దుకాణం పెట్టకుండా న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు, పెనుమదం పంచాయతీ కార్యదర్శి సీతారామరాజు, పోడూరు తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎస్సై సుధాకర్ రెడ్డి తదితరులకు మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ ఫిర్యాదులు అందజేశామని తెలిపారు. అధికారులు, ప్రభుత్వం స్థానిక ప్రజల ఇబ్బందులను గుర్తించి న్యాయం చేయాలని ఎటువంటి పరిస్థితుల్లో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. అధికారులకు ఫిర్యాదులు అందజేయడంతో పాటు మద్యం దుకాణం ఏర్పాటు చేసే స్థలం వద్ద నిరసన చేపట్టామని, అయినా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముతోట చెరువుకు చెందిన సంఘ పెద్దలు నాగేశ్వరరావు, రమేష్,బాపనయ్య, నాగేశ్వరరావు, ఘంటసాల బుజ్జి, కేతవారిపాలెంకు చెందిన సంఘ పెద్దలు పంపన నాగరాజు, కౌరు సత్యనారాయణ, వెంకటకృష్ణ, బండి సురేష్, కేత శివాజీ, కేత పండు, తోటమేరకకు చెందిన సంఘ పెద్దలు బద్దే సుబ్బారావు, జిల్లెల్ల ప్రసాద్, ఎన్. దానియేలు, బద్దె మురళీకృష్ణ, పాక సంపత్, ఎన్.నాగేశ్వరరావు, కంచు వారిపాలెంకు చెందిన సంఘ పెద్దలు చిలకపాటి సామ్యూల్ రాజు, కుంచే చిట్టిబాబు, బొంద శ్రీను, కుంచె చంద్రశేఖర్, తరపట్ల రవి, టీ. ఏసు, చిట్టాబ్బాయి, పైడావా-1కు చెందిన గ్రామపెద్దలు బొంతు లక్ష్మన్న, బొక్క చిట్టిబాబు, బండి శ్రీను, ఒక్క బాబురావు, గుబ్బల శ్రీను, జి.రాంబాబు, దుర్గమ్మచెరువు, దుర్గమ్మ చెరువుకు చెందిన సంఘ పెద్దలు కోసమే రాజు, వేడంగి చిన్న, బీర సతీష్, బొంద రాజేష్, కుసుమే జగపతి, దేవ మసేన్రావు, బర్ల సదానందం, మహిళలు విద్యార్థినులు పాల్గొన్నారు.

# గుబ్బల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓట్లు నమోదు

**కాజులూరు,పెన్‌పవర్,నవంబర్4ః**రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాస్ ఆదేశాలమేరకు రామచంద్రపరుం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కార్యక్రమం జోరందుకుంది.కాజులూరు మండల పరిధిలోని సోమవారం గొల్లపాలెం గ్రామంలో కూటమి నాయకులు గుబ్బల ఏసురాజు,తోట కృష్ణ తదితరులు ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా గుబ్బల ఏసురాజు మాట్లాడుతూ డిగ్రీ పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ తప్పిని సరిగా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు నమోదకు ఎవరూ ఇబ్బంది పడకుండా అటాస్టేషన్ కూడా వారే దగ్గరుండి చేయించే బాధ్యత తీసుకోవడంతో గొల్లపాలెంలో కొత్తగా ఓటు నమోదు చేయించుకునేందుకు గొల్లపాలెం వీఆర్వో కార్యాలయంవద్ద యువత క్యూ కట్టింది.కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ ఓట్లకోసం వారే దగ్గరుండి నమోదు చేయించేందుకు ముందుకు రావడంతో యువతీ యువకులు సంతోషం వ్యక్తం చేశారు.ఒక్కరోజులో 35 ఓట్లు నమోదు చేయడం



జరిగిందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు,తోట కృష్ణ,కోక హరిబాబు, వడ్డాది ధరణి, బొమ్మిడి సోమాలమ్మ,గొల్లపాలెం వీఆర్వో-2 ఎస్.శ్రావణికుమారి,జగన్నాధగిరి వీఆర్వో ఎం,ఈ,వివి సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## మాతృభూమికే వన్నెతెచ్చిన మహనీయుడు వివేకానందుడు....



కలెక్టర్ నాగరాణి...

**అనపర్తి,పెన్ పవర్,నవంబర్ 4:**భారతదేశ సంస్కృతినీ, ఆధ్యాత్మిక వారసత్వాన్నీ ప్రపంచానికి చాటిచెప్పి, అంతర్జాతీయంగా తన మాతృభూమి సగర్వంగా తలెత్తుకునేలా చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం కలెక్టరేట్లో అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకపథం -2025 పేరిట ముద్రించిన స్వామి వివేకానంద జీవితం - సందేశం ఫోల్డర్ ను సోమవారం కలెక్టర్ నాగరాణి ఆవిష్కరించారు.

తొలి ప్రతిని సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ స్వామి వివేకనంద భావజాల పరివ్యాప్తికి సమితి చేస్తున్న కృషిని అభినందించారు. రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏటా అనపర్తి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలలోని విద్యార్థులకు ఈ ఫోల్డర్స్ అందించి, వాటిపై పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకట రెడ్డి (బులితమ్మ), తేతలి సుందర రామారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్ రెడ్డి నల్లమిల్లి శ్రీనివాస రెడ్డి (289), మల్లిడి శ్రీనివాసరెడ్డి (లెఫ్ట్) తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో గా రాజు బాధ్యతలు స్వీకరణ.



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 04:**ఆలమూరు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా ఏ.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆలమూరు మండల ఈఓపిఆర్డిగా బాధ్యతలు నిర్వహిస్తుండగా ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో కె జాన్ లింకన్ పదవీ విరమణ చేయడంతో ఏ.రాజుకు (ఎఫ్ఏసి) ఎంపీడీవో గా నియమస్తూ జిల్లా పరిషత్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా సోమవారం ఆయన ఆలమూరు ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రాజును మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మండల నాయకులు, అధికారులు అభినందించారు.

## ఎంఎస్ఎన్ క్యాంపస్‌ను ప్రొఫెసర్ సుధాకర్ సందర్శన

**కాకినాడరూరల్ ,పెన్‌పవర్,నవంబర్4ః**ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ ప్రాంగణాన్ని విశ్వవిద్యాలయంను సోమవారం రిజిస్టర్ ప్రొఫెసర్ జి సుధాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. కమల కుమారి ఆధ్వర్యంలో క్యాంపస్ లో నిర్మాణంలో ఉన్న మహిళల వసతి గృహం, అంతర్గత రోడ్లు , వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అనంతరం ప్రస్తుతం ఉన్న మహిళా వసతిగృహం,పురుషుల వసతిగృహం లో వారికి ఉన్న సమస్యల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వసతిహృహముల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంజనీర్ ప్రొఫెసర్ నూకరత్నం, క్యాంపస్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎం పోచయ్య, వార్డెన్లు డాక్టర్ గోపి,డాక్టర్ హారిక , బోధన బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



## మీకోసంలో దరఖాస్తుదారునికి కలెక్టర్ రుణ సహాయం



**పోడూరు (భీమవరం) పెన్ పవర్, నవంబర్ -4:**మీకోసం లో దరఖాస్తుదారునికి కలెక్టర్ సిహెచ్ నాగరాణి రుణ సహాయం చేసి ఆదుకున్నారు. గడిచిన అక్టోబర్ 28న జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామానికి చెందిన బండి దుర్గారావు కుటుంబానికి జీవనాధారమైన రు. ఐదు లక్షలు విలువ చేసే17 సీమ జాతికి చెందిన పందులను జూన్ 30 న గ్రామానికి చెందిన మారమ్మ జాతర సందర్భంగా రాత్రి సమయంలో పందులను దొంగిలించారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకునే లోపు పందులను దుండగులు అమ్మినట్లు రూము మూడు లక్షలు ఇప్పిస్తామని చెప్పినట్లు చివరికి రూ 5 వేలు అందజేసినట్లు ఫిర్యాదులు తెలిపారు.నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు చేయడంతో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాలతో చర్చించి బండి దుర్గారావు భార్య అయిన బండి రాణి పేరున స్త్రీ నిది నుండి ఒక లక్ష రూపాయలు, సిఐఎఫ్ నుండి రూ.50 వేలు మొత్తం రూ.1.50 లక్షలను రుణముగా మంజూరు చేస్తూ చెక్కును జిల్లా కలెక్టర్ అందజేశారు.కలెక్టర్ మేలును మర్చిపోలేని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజల రక్షణ, భద్రతలకు నెలవుగా సేవలందించాలి: కలెక్టర్ నాగరాణి

ఉండిలో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభించిన కలెక్టర్



**పోడూరు (ఉండి) పెన్ పవర్, నవంబర్ -4:**రక్షణ, భద్రతలకు నెలవుగా పోలీస్ శాఖ సిబ్బంది సేవలందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.ఉండిలో సోమవారం పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి. ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ సాయం కోరి న్యాయం కోసం వచ్చిన ప్రజలకు రక్షణ కల్పిస్తూ సత్వర సేవలందించాలని సూచించారు. భద్రత తగులకు తగిన సమస్యలు పరిష్కరించాలని పోలీస్ స్టేషన్కు వచ్చేవారిని పలుమార్లు తప్పకుండా నిర్లక్ష్యం ఆలస్యంతో ప్రజలు ఇబ్బందులను గురికాకుండా చూడాలని సూచించారు. త్వరితగతిన సంవత్సరం పరిష్కరించి పోలీసు శాఖ పట్ల ప్రజలకు మంచి అభిప్రాయాన్ని వచ్చేలా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్పీ వి. భీమారావు తదితరులు ఉన్నారు.

# ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ నాగరాణి

- మీకోసంలో ప్రజల నుంచి 209 ఫిర్యాదులు స్వీకరణ

**పోడూరు (భీమవరం) పెన్ పవర్, నవంబర్ -4:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి 209 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అన్నింటికి చివరి తేదీ వరకు ఆగకుండా ముందుగానే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో సమాధానాన్ని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని, వాట్సాప్ ద్వారా గాని పంపాల్సి ఉందన్నారు. కోర్టు కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి దోసిరెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా. కె .సి హెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాల అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు






- పవన్ కళ్యాణ్ వెల్లడి
- కృతజ్ఞతలు తెలిపిన పంతం నానాజి

**కాకినాడ.పెన్ పవర్ నవంబర్ 4 :** కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం గ్రామంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తో పాటు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురుకుల పాఠశాల అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు, పాఠశాలలో 15 రోజుల్లో ఎంసెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు హామీ ఇచ్చినందుకు ఎమ్మెల్యే పంతం నానాజీ కృతజ్ఞతలు తెలిపారు.

# అచ్చెన్నాయుడి కొడుకు పొలిటికల్ ఎంట్రీ

**శ్రీకాకుళం, పెన్ పవర్ నవంబర్ 4:** తెలుగుదేశం పార్టీలో పరిస్థితులు క్రమంగా సీనియర్ నేతలకు అర్థమవుతున్నాయి. ఒకవైపు జరుగుతున్న పరిణామాలతో ముందు జాగ్రత్తలు పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది సీనియర్లు పార్టీ లో ఫేడ్ అవుట్ అయ్యారు. కేబినెట్ కూర్పులోనే ఈ విషయం స్పష్టమయింది. ఎందుకంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నప్పటికీ.. చినబాబు నారా లోకేష్ నిర్ణయాలే అమలవుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ల పంపిణీ దగ్గర నుంచి మంత్రి వర్గం విస్తరణ, నామినేటెడ్ పోస్టులు ఏది చూసినా లోకేష్ ముద్ర కనిపిస్తుంది. సీనియర్లు నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేందుకు ఏ మాత్రం వెనకాడటం లేదు. కుటుంబ నేపథ్యం, పార్టీలో వారికున్న ట్రాక్ రికార్డును కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. సీనియర్ నేతలు అనే ముద్రతో పంపించి వేస్తున్నారు. కొందరు వారంతట వారే స్వచ్ఛందంగా తప్పుకుంటుండగా, మరికొందరు నేతలు మాత్రం ఇంకొంత కాలం వెయిట్ చేద్దామని ఆలోచనలో ఉన్నారు. మరికొందరు మాత్రం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తాము రాజకీయాల్లో నుంచి స్వచ్ఛందంగా తప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటకే కేఈ కృష్ణమూర్తి పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకుని ఆయన తన వారసుడ్కెన శ్యాంబాబుకు బాధ్యతలను అప్పగించారు. ?ఇప్పుడు అదే బాటలో ఉత్తరాంధ్రలో సీనియర్ నేత అచ్చెన్నాయుడు కూడా అదే పనిలో ఉన్నారని అర్థమవుతుంది. ఆయనకూడా పార్టీలో జరుగుతున్న పరిణామ క్రమాలు అర్థమవుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి తనకు టిక్కెట్ దొరకకపోయినా ఆశ్చర్యం లేనంతగా పరిస్థితులు మారిపోయాయి. నవ నాయకత్వం ప్రతి నియోజకవర్గంలో తయారవుతుంది. వారిని ప్రోత్సహించడానికి, వారికి సీట్లు, మంత్రివర్గంలో స్థానం కల్పించేందుకే సైకిల్ పార్టీ సిద్ధమవుతున్నట్లు స్పష్టంగా కనపడుతుంది. ఈనేపథ్యంలో అచ్చెన్నాయుడు కూడా తన వారసుడిని రంగంలోకి దించుతున్నారు. ముందుగా రాజకీయాల్లో కాకుండా పార్టీ అధినేత చంద్రబాబుకు పరిచయ కార్యక్రమంతో ఆయన తన వారసుడిని రాజకీయంగా అందలం ఎక్కించేందుకు సిద్ధపడినట్లే కనిపిస్తుంది. దీంతో అచ్చెన్నాయుడు కూడా వచ్చే ఎన్నికల నాటికి ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు సిద్ధమవుతున్నారన్న సిగ్నల్స్ ఒకరకంగా నియోజకవర్గ ప్రజలకు, మరొక వైపు అధినాయకత్వానికి ఇచ్చినట్లయింద.?ఇటీవల అచ్చెన్నాయుడు తన కుమారుడు కృష్ణమోహన్ ను చంద్రబాబుకు పరిచయం చేశారు. శ్రీకాకుళంజిల్లాలో రాజకీయంగా బలమైన కుటుంబం కింజారపు కుటుంబం. ఆ కటుంబం నుంచి ఇప్పటికే యువనేత రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నారు.



ఆయనను రాష్ట్ర రాజకీయాల్లోకి తీసుకు రావాలన్నది చంద్రబాబు, లోకేష్ బలమైన ఆకాంక్ష. వచ్చే ఎన్నికల నాటికి రామ్మోహన్ నాయుడు తన కుటుంబం నుంచే తనకు పార్టీలో ప్రత్యర్థి అయ్యే అవకాశాలున్నాయి. తనను పక్కన పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నది అచ్చెన్న అభిప్రాయం. అందుకే ఆయన తాను తప్పుకుని తన కుమారుడు ఎంపీ టిక్కెట్ అయినా పరవాలేదు.. ఏదో ఒక రాజకీయ పదవి ఉంటే చాలునన్న ఉద్దేశ్యంతో కుమారుడు కృష్ణమోహన్ ను రాజకీయ అరంగేట్రం చేయించే పనిలో ఉన్నారు. ఇప్పటికే టెక్కలి బాధ్యతలను చూస్తున్న కృష్ణమోహన్ వచ్చే ఎన్నికల నాటికి పార్టీ ఆదేశిస్తే టెక్కలి నుంచి అసెంబ్లీకి, లేదంటే శ్రీకాకుళం ఎంపీ పదవికి పోటీ చేసే వీలుంది.

# అడవి పందుల కోసం పెట్టిన విద్యుత్ వైరు తగిలి వ్యక్తి మృతి



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** అడవి పందుల కోసం పెట్టిన విద్యుత్ వైర్ తగిలి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం జగ్గంపేట మండలం నరేంద్రపట్నం గ్రామంలో వేటగాళ్లు అడవిపందుల కోసం విద్యుత్ వైర్లు అమర్చారు. ఈ విషయం తెలియక అదే గ్రామానికి చెందిన పోతురాజు తలుపులయ్య ఆ విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఇటీవల కాలంలో వేటగాళ్లు విద్యుత్ వైర్లు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అంత దర్జాగా విద్యుత్ వైర్లు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్న సరే అధికారులు పట్టనట్టు ఉండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పోలవరం కాలువలోకి దూకి యువకుడి ఆత్మహత్య



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 4:** జగ్గంపేటలోని పోలవరం కాలువలోకి దూకి ఆదివారం రాత్రి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి పోలీసులు వివరాల ప్రకారం.. జగ్గంపేట పద్మనాభ నగర్ కు చెందిన చిక్కాల చక్రధర్(27) జగ్గంపేట నుంచి గుర్రపాలెం వెళ్లే రహదారిలో ఉన్న పోలవరం కాలువ వద్ద బైకు, చెప్పులు విడిచిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన స్నేహితుడికి మెసేజ్ పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే విషయం తెలిసిన స్థానికులు, పోలీసులు రాత్రంతా అతన్ని వెతకగా సోమవారం ఉదయం శవమై తేలాడు. పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీసి బంధువులకు సమాచారం ఇచ్చి పోస్టుమార్టంకు తరలించారు.

# మహాధర్నాను జయప్రదం చేయండి

**విశాఖ దక్షిణం పెన్ పవర్ నవంబర్ 4:** విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు జగదాంబ ఆఫీస్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను సాలిగ్రాంపురంలో 1984వ సంవత్సరంలో 150 పడకల సామర్థ్యంతో నిర్మించారు. పోర్టు అండ్ డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిట్కెర్ అయిన కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు మరియు సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు వారి వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి 40వేల మందికి సేవలందిస్తున్నది. అటువంటి మన పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో "మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్"గా 300పడకల నిర్మాణం కొరకు ప్రైవేట్‌వారికి ఇచ్చుటకు పోర్టులో వున్న యూనియన్స్ అన్నీ వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఏకపక్షంగా నవంబరు 8న టెండరు ఓపెన్ చేస్తున్నారు. ఈ చర్య 40 వేల మంది ఆరోగ్య భద్రతను ప్రైవేట్ చేతుల్లో పెట్టడమే. ఇదే జరిగితే ప్రైవేట్ యాజమాన్యం దయాదాక్షిన్యాలపై ఆధారపడాల్సి వస్తుంది. నవంబర్ 8వ తేదీన ఉదయం 10 గంటలకు పోర్టు ఎబిబి వద్ద జరిగబోయే మహాధర్నాలో పెద్ద ఎత్తున పోర్ట్ అండ్ డాక్ ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, క్యాజువల్ వర్కర్లు, పూల్ కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

పోర్టుల్లో పిపిపి/బిఓటి విధానాలు విఫలమయ్యాయని గతంలో స్వయంగా 'కాగ్' (కంప్ట్రోలర్ %ు%ఆడిటర్ జనరల్) మొట్టికాయలు వేసిన సంగతి విధితమే. గతంలో కార్మిక సంక్షేమ కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్, కళావాణి ఆడిటోరియం నిర్మిస్తే అది ప్రైవేటుపరం చేయడంతో కార్మికులు వాటి ప్రయోజనాలకు దూరమయ్యారు. పై అనుభవాల దృష్ట్యా ఒకసారి ప్రైవేట్‌చేతుల్లోకి వెళితే తిరిగి పోర్టు చేతుల్లోకి వచ్చే అవకాశం లేదు. ఇప్పుడు హాస్పిటల్‌కి కూడా అదే గతి పడుతుంది. పోర్టు అండ్ డాక్ కార్మికులు పెన్షనర్లు, పూల్ మరియు కాజువల్ కార్మిక కుటుంబాలు వైద్యానికి దూరమవుతారు. ప్రారంభంలో బ్రహ్మాండంగా వుంటుందని భ్రమలు కల్పిస్తారు. తరువాత కాలంలో ఇది ఒప్పందంలో లేదు, అది ఒప్పందంలో లేదు, ధరల పెరిగాయి, ఇది వర్తించదు అది వర్తించదు, మీరు డబ్బులు చెల్లిస్తే గాని కుదరదని కరాఖండిగా చెబుతారు. మనపై అదనంగా మోయలేని భారం పడుతుంది. ఆరోగ్యం కోసం ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తుంది. మనం నష్టపోకుండా ఇప్పుడే అడ్డుకోవాలి. మనం ఐక్యంగా పోరాడితే విజయం మనదే.

ఉద్యోగులు మరియు కార్మికులు పొందే వైద్యాన్ని కూడా లాభనష్టాలు బేరీజు వేయడం దుర్మార్గం. 'మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత-పొందడం ఉద్యోగ, కార్మికుల హక్కు'. పోర్టు హాస్పిటల్ విషయమై ఏద్కెనా నిర్ణయం తీసుకునే ముందు అన్ని ఫెడరేషన్ల అభిప్రాయాలు తీసుకొని ముందుకు వెళ్తామని గతంలో హామీ ఇచ్చిన విపీఎ మాట తప్పింది. పోర్టులోనున్న కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోర్టు హాస్పటల్‌ను ప్రైవేటీకరించొద్దని స్పష్టంగా చెప్పాయి. ఏపీ హైకోర్టు కూడా హాస్పిటల్ విషయమై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పింది. కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా గోల్డెన్ జూబ్లీ హాస్పటల్ ప్రైవేటుకు ఇవ్వడానికి యాజమాన్యం మరియు ప్రభుత్వం ముందుకెళ్లడం చూస్తే ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తోంది. ఒక ప్రైవేటు వ్యక్తి లాభం కోసం ఆలోచిస్తారు తప్ప సేవ చేయాలని ఆలోచన వుండదు.

అందువలన, ఉద్యోగ, కార్మిక, రిట్కెర్ అయిన కార్మికుల కుటుంబాలకు పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వారికివ్వరాదని, దానికి బదులుగా నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆసుపత్రిని మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్ మిషనరీలను, స్పెషల్కెజ్డ్ స్టాఫ్‌ను, నాణ్యమైన మందులను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేసే చర్యలను చేపట్టాలి. ఏఐటీయూసీ నాయకులు రమణ బాబు, హెచ్ఎంఎస్ నాయకులు కె.మంగయ్య నాయడు, సిఐటియు నాయకులు బి.జగన్, కె.సత్యానారయణ, బి.లక్మణరావు, జె.సత్యానారయణ,వి రామలింగేశ్వర రావు, సి ఎఫ్ టి యు ఐ నాయకులు క్రీష్ణ మూర్తి, ఐ ఎన్ టి యు సి నాయకులు జి.చందు, బి ఎం ఎస్ నాయకులు బి. రవి, ఫెన్షన్స్ సంఘం నాయకులు బి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 11 నుంచి ఏపీ బడ్జెట్ భేటీ

**విజయవాడ, నవంబర్ 4,పెన్ పవర్:** ఈ నెల 11 నుంచి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అదే రోజు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఆర్థిక పద్దుతో పాటు పలు కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం కసరత్తు చేసింది.అసెంబ్లీ సమావేశాలు నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. నవంబర్ 11వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నే ప్రవేశపెట్టిన సర్కార్? ఇక పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తోంది.తాజాగా ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో భాగంగా? పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. నవంబర్ 11వ తేదీన లేదా మరునాడు వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సారి అసెంబ్లీ సమావేశాలు పది రోజులకుపైగా జరిగే అవకాశం ఉంది.ఈ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టడంతో పాటు కీలక బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇక ఇప్పటివరకూ ఉన్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నవంబర్ నెలాఖరుతో ముగియనుంది. ఈ క్రమంలోనే? పూర్తిస్థాయి బడ్జెట్ కు సర్కార్ సిద్ధమైంది.నిజానికి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒకే ఏడాదిలో రెండు సార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తప్పనిసరి పరిస్థితుల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.ఆర్థిక పరిస్థితి పై స్పష్టత వచ్చేందుకు గడువు తీసుకోవాల్సి వచ్చిందని వివరించాయి. అందుకు అనుగుణంగానే రెండోసారి కూడా ఏపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది.చివరిసారిగా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో పాటు పలు కీలక అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేసింది. ఆర్థిక పరిస్థితి, మద్యం, శాంతి భద్రతలపై వివరాలను సభ ముందుకు ఉంచింది. గత సమావేశాల్లోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతారని భావించినప్పటికీ? ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే కొనసాగించింది. ఈ గడువు ఈనెల చివరితో పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం జరగబోయే సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని సర్కార్ నిర్ణయించింది.ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ తో పాటు కీలక అంశాలు సభలో చర్చకు అవకాశం ఉంది. సూపర్ సిక్స్ లోని స్కీమ్ ల అమలు, నూతన మద్యం పాలసీ, ఉచిత ఇసుక సరఫరాపై చర్చ జరగనుంది. అంతేకాకుండా? మరికొన్ని కొత్త స్కీమ్ ల అమలుపై కూడా సభలో కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది.అసెంబ్లీ సమావేశాల



నిర్వహణ నేపథ్యంలో నవంబర్ 6వ తేదీన ఏపీ కేబినెట్ భేటీ కానుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. సమావేశాల నిర్వహణతో పాటు బడ్జెట్ పై లోతుగా చర్చించే అవకాశం ఉంది. అంతేకాకుండా? సభ ముందుకు తీసుకురావాల్సిన అంశాలు చర్చకు రానున్నాయి.

సూపర్ సిక్స్ కు బడ్జెట్ కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పటయి ఐదు నెలలుకావస్తుంది. ఇప్పటి వరకూ ఎన్నికలసమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో కొన్నింటిని మాత్రమే అమలు చేసింది. ప్రధానంగా పింఛను నాలుగు వేల రూపాయలకు పెంచడంతో పాటు తాజాగా ఉచిత గ్యాస్ సిలిండ్ పథకాన్ని దీపావళి రోజు నుంచి లాంచ్ చేసింది. ఉచిత ఇసుక, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేయడం, మెగా డీఎస్సీ వంటి వాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన తొలి రోజునే సంతకాలు చేశారు. కానీ సూపర్ సిక్స్ హామీలలో ఒకటి రెండు మాత్రమే అమలు చేయడంతో ఇటు ప్రజల్లో కొంత అసంతృప్తి అయితే ఉంది. అదే సమయంలో విపక్షాలకు విమర్శలు చేయడానికి ఒక దారి దొరికినట్లయింది.అయితే వీటన్నింటికీ చెక్ పెట్టేలా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల గురించి తేల్చేసే సమయం దగ్గర పడింది. బడ్జెట్ సమావేశాల్లో వీటిపై స్పష్టత రానుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇన్నాళ్లయినా పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పైనే ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. దీనివల్ల సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టత రాకుండా ఉంది. తల్లికి వందనం లాంటి ప్రాజెక్టును వచ్చే ఏడాది జనవరి నెల నుంచి అమలు చేయడానికి సిద్ధమని మంత్రల ప్రకటనతో తెలిసినా, దానికి ఎంత నిధులు కేటాయిస్తారన్నది మాత్రం ఇంకా తేలలేదు. ఇక మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కూడా అంతే. త్వరలో అంటూ మంత్రులు ఊరించడం మినహా నిధుల కేటాయింపు, అమలు తేదీపై స్పష్టత రాకపోవడంతో దానిపై విపక్షాలు నిలదీస్తున్నాయి.నవంబరు 12వ తేదీన రాష్ట్ర పూర్తిస్థాయిబడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. ఇందుకు సంబంధించి అధికారులు కసరత్తులు కూడా ప్రారంభించారు. దాదాపు బడ్జెట్ పై అంకెలు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వం చేసిన అప్పులతో పాటు సంక్షేమపథకాలను అమలు చేయాలంటే ఎక్కువ నిధులు అవసరం. అందుకు అవసరమైన నిధుల సమీకరణ పై అనేక రకాలుగా అధికారులు ప్రయత్నాలు చేశారు. కొంత మేరకు సఫలమయ్యారు. ఒశ్రీబనీ శ్రీవజీట – సీక్కోలు వాసులకు కేంద్ర మంత్రి ఒకేసారి రెండు గుడ్ న్యూస్ లు దేనికి ఎంత నిధులు... కానీ సూపర్ సిక్స్ హామీలన్ని అమలు చేయాలంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదన్నది అధికారుల వాదన. ఇప్పటికే ఐదు నెలల్లోనే కొత్త ప్రభుత్వం నలభై ఏడు వేల కోట్ల రూపాయలను రుణాలుగా సేకరించింది. ఇంకా తేవాల్సిన అప్పులు చాలా ఉన్నాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సానుకూలత ఉండటంతో భవిష్యత్ లో పరిస్థి?తి మెరుగు పడుతుందని భావిస్తున్నారు. ప్రతిపద్దుకూ ఖచ్చితంగా లెక్కలు బడ్జెట్ లో చూపించాలి. అందుకే సూపర్ సిక్స్ హామీలకు ఏ మేరకు నిధులను కేటాయించనుందన్నది నవంబరు 12వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేపెట్టే బడ్జెట్ లో తేలనుంది. అప్పటికి గాని హామీల అమలుపై కొంత మేరకు స్పష్టతరానుంది. అప్పటి వరకూ వెయిట్ చేయాల్సిందే.

## జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు



**విజయవాడ, నవంబర్ 4, పెన్ పవర్:** కొత్త రేషన్ కార్డులపై ఏపీ సర్కార్ అప్డేట్ ఇచ్చింది. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డుల జారీకి కసరత్తు చేస్తుంది. అలాగే పాత కార్డుల స్థానంలో కొత్త డిజైన్ తో కార్డులు జారీ చేయనున్నారు. వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది.కొత్త రేషన్ కార్డుల జారీపై ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనుంది. కొత్తగా పెళ్లైన వారితో పాటు అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ప్రస్తుత కార్డుల రీడిజైన్ తో పాటు కొత్త లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది.ఏపీలో ప్రభుత్వం 1 కోటి 48 లక్షల వైట్ రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిల్లో 90 లక్షల కార్డులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ కార్డులకు మాత్రమే కేంద్రం ఉచితంగా బియ్యం, తక్కువ ధరకు కందిపప్పు, పంచదార ఇతర సరుకులు అందిస్తుంది. మిగిలిన కార్డులకు అందిస్తున్న ఉచిత బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, ఇతర సరుకులకు అయ్యే రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఈ కార్డులను కూడా జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని చాలా కాలంగా కోరుతుంది. అయితే కేంద్రం నుంచి స్పందనలేదు.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత... రాష్ట్రానికి ఆర్థికభారం కాకుండా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల వినియోగంపై సమీక్షలు చేస్తుంది. పౌరసరఫరాల శాఖ డేటా ఆధారంగా రాష్ట్రంలోని 17,941 అంత్యోదయ అన్న యోజన కార్డుదారులు, మరో 1,36,420 పీహెచ్‌హెచ్ కార్డుదారులు... గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఈ కార్డులు తొలగిస్తే ఏడాదికి రూ.90 కోట్ల వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తుంది. వీటి స్థానంలో అర్హులైనవారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయవచ్చని ప్రభుత్వం ఆలోచన చేస్తుందిప్రభుత్వంపై అదనపు భారం పడకుండా 1.5 లక్షలకు పైగా పేద కుటుంబాలకు వచ్చే ఏడాది జనవరిలో కొత్త రేషన్‌కార్డులు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు వేస్తుంది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో... రేషన్ కార్డుల రూపురేఖలు మార్చారు. బియ్యం కార్డులు సైతం జారీ చేశారు. రేషన్ కార్డులపై వైఎస్ జగన్, రాజశేఖర్ రెడ్డి ఫొటోలు ఉండేవి. రాష్ట్రంలో కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో...రేషన్ కార్డుల డిజైన్లు మారనున్నాయి. లేత పసుపు రంగు కార్డుపై ప్రభుత్వ అధికారిక చిహ్నం ఉన్న రేషన్ కార్డు నమూనాను పౌరసరఫరాల శాఖ ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది.ప్రభుత్వం వద్ద కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు సహా మార్పు చేర్పులు కోసం భారీగా కార్డులు పెండింగ్ లో ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం 30,611 దరఖాస్తులు, కార్డుల స్ప్లిట్ కోసం 46,918 దరఖాస్తులు, సభ్యులను యాడ్ చేసేందుకు 2,13,007 దరఖాస్తులు, తొలగింపు కోసం 36,588, అడ్రస్ మార్పు కోసం 8,263, సరెండర్ కోసం 685 దరఖాస్తులు... మొత్తంగా 3.36 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

## స్మార్ట్ కార్డుల్లో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు




**రాజమండ్రి, నవంబర్ 4, పెన్ పవర్:** కొత్త వెహికల్స్ కొనేవారికి, లైసెన్స్‌లు తీసుకునేవారికి రాష్ట్రం ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు స్మార్ట్ కార్డుల్లో ఇవ్వనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పనుంది. రాష్ట్రంలో ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్ లు స్మార్ట్‌కార్డుల్లో రానున్నాయి. కొత్త వెహికల్స్ కొనేవారికి, లైసెన్స్‌లు తీసుకునేవారికి రాష్ట్రం ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని రవాణా శాఖలో స్మార్ట్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం అయింది. స్మార్ట్ కార్డుల సరఫరాకు టెండర్ల పిలిచేందుకు ప్రక్రియ మొదల పెట్టింది.కొత్త వాహనం కొనుక్కుని, రవాణా శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక ఇచ్చే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్ పొందినప్పుడు అందజేసే డీఎల్ కార్డుల జారీకి ప్రక్రియ ప్రారంభం అయింది. నవంబర్ నెల నుంచే కార్డులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున 10-12 వేల ఆర్సీ, డీఎల్ కార్డుల చొప్పున నెలకు మూడు లక్షలు, ఏడాదికి దాదాపు 36 లక్షల కార్డులు అవసరం అవుతాయి. గతంలో జిల్లా రవాణా శాఖ, ఆర్టీవో కార్యాలయాల్లో వాటిపై వివరాలు ముద్రించి, వాహనదారుల ఇళ్లకు స్పీడ్ పోస్టులో పంపేవారు. దీనికోసం రూ.200 ఫీజు, స్పీడ్ పోస్టు ఖర్చు కూడా వసూలు చేసేవారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ కార్డుల జారీకి రవాణా శాఖను ఆదేశించింది. నవంబర్ మొదటి వారం నుంచి వాహన్, సారథి పోర్టల్‌లో ఈ కార్డుల కోసం ఆప్షన్ ఇవ్వనున్నారు. దీనికి రూ.200 ఫీజుతో పాటు, స్పీడ్‌పోస్టు ఛార్జి రూ.35 ఆన్‌లైన్‌లోనే తీసుకుంటారు. స్మార్ట్ కార్డుల సరఫరాకు టెండర్లు పిలిచేందుకు రవాణా శాఖ దస్త్రం సిద్ధం చేసింది. దానిని ప్రభుత్వానికి పంపింది. అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే టెండర్లు పిలిచి, సరఫరాదారును ఎంపిక చేస్తారు.జూలై నుంచి ఈ విధానాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్‌సీతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని జెరాక్స్ కాపీ వాహనదారుల వెంట ఉంచుకుంటే సరిపోతుందని ఆదేశాలు ఇచ్చింది. కాకపోతే వాహనదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ తనిఖీల సమయంలో ఆర్సీ, డీఎల్ కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మళ్లీ స్మార్ట్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది.దీంతో వాహనదారుల జోబుల్లో మరోకార్డు పెరగనుంది. వర్షాలు వచ్చే సమయంలో ఇబ్బందులు పడనక్కరలేదు. ఇది వరకు కాగితపు ధ్రువీకరణ పత్రం వర్షాలు పడితే తడిచిపోయేది. స్మార్ట్ కార్డులు వస్తే, వర్షం భయం నుంచి వాహనదారులు బయటపడతారు. దీంతో వాహనదారులకు అదనంగా కొంత ఖర్చు అవుతుంది. దాదాపు 250 వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఖర్చు అయినప్పటికీ స్మార్ట్ కార్డుతో ఉపయోగాలు ఎక్కువని వాహనదారులు భావిస్తోన్నారు.

# దెందులూరులో టీడీపీ వర్సెస్ జనసేన

**ఏలూరు, నవంబర్ 4, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక నియోజకవర్గాల్లో మిత్ర పక్షాల మధ్య విభేదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆధిపత్య పోరు నడుస్తుంది. మద్యం దుకాణాల కేటాయింపు, ఇసుక సిండికేట్లు, నామినేటెడ్ పదవుల విషయంలో ఇలా ప్రతి విషయంలో ఒకరినొకరిపై విమర్శలు చేసుకుంటున్నారు. ప్రధానంగా కూటమి పార్టీలు స్వీప్ చేసిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఈ ఆధిపత్య పోరు ఎక్కువగా కనపడుతుంది. ఇటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, అటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు వెళుతున్నప్పటికీ కూటమి నేతల మధ్య విభేదాలు పార్టీ అధినేతలకు తలనొప్పిగా మారాయి.. ప్రధానంగా పింఛన్ల పంపిణీ విషయంలో కూడా ఈరోజు అనేక నియోజకవర్గాల్లో కూటమి పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. తాము పింఛను పంపిణీ చేయాలని ఒకరంటే.. తాము కూడా భాగస్వామ్యులవుతామని జనసేన నేతలు కూడా రెడీ అవుతుండటంతోనే ఈ పరిస్థితులు తలెత్తాయి. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి మీరెవ్వరంటూ టీడీపీ నేతలు జనసేన నేతలను ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో కలసి పోటీ చేసి, అభ్యర్థి విజయానికి ఇద్దరూ కృషి చేసినప్పటికీ, తర్వాత మాత్రం అనేక అంశాలు విభేదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విభేదాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చినట్లు తెలిసింది.పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరు, చింతలపూడి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. వీరు ఒకరినొకరు వీధుల్లోకి వచ్చి తిట్టుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. ఇది పెద్ద పంచాయతీగా మారింది. అయితే దెందులూరులో విభేదాలపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పందించారు.కొన్ని అరాచక శక్తులు ఇటీవలే జనసేనలో చేరారని,పబ్బం గడుపుకోవడానికే వాళ్లు పార్టీలో చేరారని చింతమనేని అన్నారు.చేరినవాళ్లు చేరినట్టు ఉంటే మంచిదని,పెన్షన్ల పంపిణీతో వాళ్లకు సంబంధమేంటని ఆయన ప్రశ్నించారు.గ్రామాల్లో గొడవలు పెట్టే సంస్కృతి మానుకోవాలని కోరారు.ఆ రోజు కూటమి ఓటమికి ప్రయత్నించింది వీళ్లేనని, ఇప్పుడుపార్టీలో చేరి అధికారం చెలాయిస్తామంటే కుదరదని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. జనసేన అధినాయకత్వంతో తాను మాట్లాడతానని చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

**విజయనగరం నెల్లిమర్లలోనూ....**

వైసీపీ హయాంలో జనమంతా విసిగిపోయారు. ప్రభుత్వం మారాలనే ఉద్దేశంతో ఏపీలో కూటమి నేతలు ఒక్కటై పనిచేశారు. ఊహించిన దానికంటే అద్భుతమైన విజయాన్ని సొంతం



చేసుకున్నారు. కలసి పనిచేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు.. రానురాను మితిమీరుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో అయితే.. నువ్వా-నేనా అన్నట్లుగా పరిస్థితి ఉందని.. సొంత పార్టీల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే లోకం మాధవి వర్సెస్ టీడీపీ ఇన్‌ఛార్జ్ బంగార్రాజుగా మారిందట. ఇప్పటివరకూ లోలోపలే తన్నులాడుకున్న వారు.. ప్రస్తుతం రోడ్డెక్కారనే టాక్ బలంగా వినిపిస్తోంది.విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం కూటమిలో కుమ్ములాటలు బహిర్గతం అవుతున్నాయట. మొన్నటి వరకూ లోలోపలే కత్తులు దూసుకున్న నాయకులు నేడు బహిరంగంగానే బాహాబాహీకి దిగుతున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి విభేదాలు చేరుకున్నాయట. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ అనికూడా చూడకుండా బంగార్రాజును లోకం మాధవి అవమానించారట. యాఎని పిలిచి? ఇతనిని బయటకి పంపించాలంటూ హుకుం జారీ చేయటంతో నగర పంచాయతీ సమావేశంలో ఆయన కంగుతున్నారట. తర్వాత కుదుటపడి. బంగార్రాజు కూడా ఎమ్మెల్యేకి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారట. తాను ఆహ్వానం మేరకే సమావేశానికి వచ్చానని.. దానిపై తనకు క్లారిటీ ఉందని బదులు ఇవ్వటంతో
సమావేశం కాస్తా హీట్‌గా మారిందట.నియోజకవర్గంలో ఇలాంటి గొడవలు కొత్తేమీ కాదట. ఇటీవల చింతలవలస రోడ్డు శంకుస్థాపన అంశంలోనూ ఇలాంటి సీన్ జరిగిందట. శంకుస్థాపన కార్యక్రమానికి తమకెందుకు ఆహ్వానం ఇవ్వలేదని తెలుగు తమ్ముళ్లు.. జనసేన ఎంపీపీని అడ్డుకున్నారు. కూటమిలో అందరం కలసి పనిచేస్తేనే గెలుపు సాధ్యమైందని అలాంటపుడు తమను ఎలా పక్కన పెడతారనేది టీడీపీ వాదనగా తెలుస్తోంది. మమ్మల్ని పిలవకుండానే.. మీరే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారా అని ప్రశ్నించటంతో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొందట. దీంతో సదరు ఎంపీపీ వెనక్కి వెళ్లిపోయారు. ఈ పంచాయితీ అక్కడితో ఆగలేదు. ఇదే విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కూడా చేసేదేం లేక.. విభేదాలు లేకుండా పని చేయాలని సూచనలు మాత్రమే చేశారట.మరోవైపు.. తెలుగుదేశం కూడా జనసేకు షాకులిస్తూనే ఉందట. మార్క్ ఫెడ్ ఛైర్మన్ అయ్యాక ఏర్పాటు చేసిన సభకి ఎమ్మెల్యే లోకం మాధవికి ఆహ్వానం లేదట. కేవలం టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలను మాత్రమే ఆహ్వానించారు . ఇలా ఎప్పటికప్పుడే కూటమిలో కుమ్ములాటలు బహిర్గతం అవుతున్నాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. కర్రోతు బంగార్రాజును కూడా ఎక్కడా తగ్గవద్దని.. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ భరత్.. హింట్ ఇచ్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి. కనీసం ఓటు బ్యాంక్ లేని వాళ్లని ఎమ్మెల్యేగా చేస్తే? రివర్స్ అవ్వటం ఏంటని టీడీపీ సీనియర్లు సైతం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందే ఊహించిన మాధవి.. కేడర్‌ను పెంచుకునే పనిలో పడ్డారట. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారనే టాక్ బలంగా వినిపిస్తుంది . తనకి నియోజకవర్గంలో తగిన బలం ఉండాలనే తపనలో ఆమె ఉన్నారని తెలుస్తోంది. నెల్లిమర్లలో టీడీపీని తట్టుకొని నిలబడాలంటే.. సీనియర్ నాయకుల అవసరం ఉందని గ్రహించిన మాధవి.. వైసీపీ సీనియర్లకు గాలమేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. జనసేనాని అండదండలు కూడా మాధవికి.. బలంగానే ఉన్నాయనే టాక్ ఉంది. జనసేన పార్టీకి మాధవి ఫండింగ్ చేస్తుండడం వల్లే ఆమెకు అంత ప్రాధాన్యత అనే విమర్శించిన వాళ్లూ నియోజకవర్గంలో ఉన్నారట.బంగార్రాజు– మాధవి వ్యవహార శైలితో.. లోకల్ లీడర్లు ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారట. ప్రభుత్వంలో కంటే ప్రతిపక్షమే బెటర్ అనే ఫీలింగ్‌తో కొందరు ఉన్నారంటే.. నెల్లిమర్లలో పరిస్థితి ఏంటనేది తెలుస్తోంది. టీడీపీ నాయకులకు ఎలాంటి పనులు చేయవద్దని మాధవి ఇప్పటికే అధికారులకు హుకుం జారీ చేశారన్న టాక్ వినిపిస్తోంది. తాను చెప్పిన నాయకులు వస్తేనే పనులు చేయాలంటూ ఎమ్మెల్యే చెప్పటంతో వివాదం కాస్తా ఎక్కువ అవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గొడవలు ముదరకముందే.. రెండు పార్టీల అధినేతలూ పిలిపించి మాట్లాడితే తప్ప పరిస్థితిలో మార్పు రాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

## రామచేప రేటే వేరప్పా....

**కాకినాడ, నవంబర్ 4, పెన్ పవర్:** పులస చేప తెలుగు రాష్ట్రాల్లో ఎంత ఫేమసో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గోదావరికి వరదనీరు వచ్చినప్పుడు జాలర్లకు చిక్కే ఈ చేపలు.. వారి దండిగా కాసులను అందిస్తాయి. జులై నుంచి అక్టోబర్ వరకు పులసలు చిక్కుతూ ఉంటాయి. రుచితో పాటు ఎన్నో పోషక విలువలు ఈ చేప సొంతం. పల్లెటూర్లలో ఎవరైనా పులస.. కొని వండుకున్నారంటే.. ఊరంతా ఆ విషయాన్ని ఆ రోజు గొప్పగా చెబుతుంటారు. అది పులస రేంజ్. ఇక పులస మాదిరిగానే.. గోదావరి జిల్లాల్లో 'రామ చేప' కూడా చాలా పాపులర్. వీటికి కూడా మంచి డిమాండ్ ఉంటుంది. రామ చేపలు చూడటానికి బొమ్మిడాయిలు మాదిరిగానే ఉంటాయి. టేస్ట్ అయితే పులసల లాగానే ఉంటుందట. ఈ చేపలు 5 నుంచి 7 అంగుళాలు ఉంటాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉప్పుటేరు పరివాహక ప్రాంతాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ చేపల లభ్యత ఉంటుందిరామల చేపలు.. కిలోకు 40 వరకు తూగుతాయి. కానీ వీటిని పీస్‌ల లెక్క అమ్ముతూ ఉంటారు. సాధారణంగా రామలు ధర ఒక్కోటి రూ.25 వరకు ఉంటుంది. కానీ ప్రారంభ సీజన్‌లో ఒక్కోటి రూ.30కు పైనే పలుకుతుంది. డిమాండ్‌ను బట్టి ఒక్కోసారి రూ.40 నుంచి రూ.50 పలుకుతుంది. ఈ చేపలను మన దగ్గర తినడమే కాకుండా.. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తారు. మసాలా దట్టించి ఇగురు పెట్టినా.. ఇదే సీజన్‌లో కాసే లేత చింతకాయలతో కలిపి పులుసు పెట్టినా.. ఆ రుచి అమోఘం అంటున్నారు మాంసాహార ప్రియులు. చింతకాయలతో కలిపి వీటిని కూర వండితే ఆ వాసన ఊరి పొలిమేర దాటాల్సిందేనట.

# అచ్చెన్నాయుడి కొడుకు పొలిటికల్ ఎంట్రీ...

**శ్రీకాకుళం, నవంబర్ 4, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో పరిస్థితులు క్రమంగా సీనియర్ నేతలకు అర్థమవుతున్నాయి. ఒకవైపు జరుగుతున్న పరిణామాలతో ముందు జాగ్రత్తలు పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది సీనియర్లు పార్టీ లో ఫేడ్ అవుట్ అయ్యారు. కేబినెట్ కూర్పులోనే ఈ విషయం స్పష్టమయింది. ఎందుకంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నప్పటికీ.. చినబాబు నారా లోకేష్ నిర్ణయాలే అమలవుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ల పంపిణీ దగ్గర నుంచి మంత్రి వర్గం విస్తరణ, నామినేటెడ్ పోస్టులు ఏది చూసినా లోకేష్ ముద్ర కనిపిస్తుంది. సీనియర్లు నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేందుకు ఏ మాత్రం వెనకాడటం లేదు. కుటుంబ నేపథ్యం, పార్టీలో వారికున్న ట్రాక్ రికార్డును కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. సీనియర్ నేతలు అనే ముద్రతో పంపించి వేస్తున్నారు. కొందరు వారంతట వారే స్వచ్ఛందంగా తప్పుకుంటుండగా, మరికొందరు నేతలు మాత్రం ఇంకొంత కాలం వెయిట్ చేద్దామని ఆలోచనలో ఉన్నారు. మరికొందరు మాత్రం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తాము రాజకీయాల్లో నుంచి స్వచ్ఛందంగా తప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటకే కేఈ కృష్ణమూర్తి పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకుని ఆయన తన వారసుడైన శ్యాంబాబుకు బాధ్యతలను అప్పగించారు. ?ఇప్పుడు అదే బాటలో ఉత్తరాంధ్రలో సీనియర్ నేత అచ్చెన్నాయుడు కూడా అదే పనిలో ఉన్నారని అర్థమవుతుంది. ఆయనకూడా పార్టీలో జరుగుతున్న పరిణామ క్రమాలు అర్థమవుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి తనకు టిక్కెట్ దొరకకపోయినా ఆశ్చర్యం లేనంతగా పరిస్థితులు మారిపోయాయి. నవ నాయకత్వం ప్రతి నియోజకవర్గంలో తయారవుతుంది. వారిని ప్రోత్సహించడానికి, వారికి సీట్లు, మంత్రివర్గంలో స్థానం కల్పించేందుకే సైకిల్ పార్టీ సిద్ధమవుతున్నట్లు స్పష్టంగా కనపడుతుంది. ఈనేపథ్యంలో అచ్చెన్నాయుడు కూడా తన వారసుడిని రంగంలోకి దించుతున్నారు. ముందుగా రాజకీయాల్లో కాకుండా పార్టీ అధినేత చంద్రబాబుకు పరిచయ కార్యక్రమంతో ఆయన తన వారసుడిని రాజకీయంగా అందలం ఎక్కించేందుకు సిద్ధపడినట్లే కనిపిస్తుంది. దీంతో అచ్చెన్నాయుడు కూడా వచ్చే ఎన్నికల నాటికి ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు సిద్ధమవుతున్నారన్న సిగ్నల్స్ ఒకరకంగా నియోజకవర్గ ప్రజలకు, మరొక వైపు అధినాయకత్వానికి ఇచ్చినట్లయింద.?ఇటీవల అచ్చెన్నాయుడు తన కుమారుడు కృష్ణమోహన్ ను చంద్రబాబుకు పరిచయం చేశారు. శ్రీకాకుళంజిల్లాలో రాజకీయంగా బలమైన కుటుంబం కింజారపు కుటుంబం. ఆ కటుంబం నుంచి ఇప్పటికే యువనేత రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఆయనను రాష్ట్ర రాజకీయాల్లోకి తీసుకు రావాలన్నది చంద్రబాబు, లోకేష్ బలమైన ఆకాంక్ష. వచ్చే ఎన్నికల నాటికి రామ్మోహన్ నాయుడు తన కుటుంబం నుంచే తనకు పార్టీలో ప్రత్యర్థి అయ్యే అవకాశాలున్నాయి. తనను పక్కన పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నది అచ్చెన్న అభిప్రాయం. అందుకే ఆయన తాను తప్పుకుని తన కుమారుడు ఎంపీ టిక్కెట్ అయినా పరవాలేదు.. ఏదో ఒక రాజకీయ పదవి ఉంటే చాలునన్న ఉద్దేశ్యంతో కుమారుడు కృష్ణమోహన్ ను రాజకీయ అరంగేట్రం చేయించే పనిలో ఉన్నారు. ఇప్పటికే టెక్కలి బాధ్యతలను చూస్తున్న కృష్ణమోహన్ వచ్చే ఎన్నికల నాటికి పార్టీ ఆదేశిస్తే టెక్కలి నుంచి అసెంబ్లీకి, లేదంటే శ్రీకాకుళం ఎంపీ పదవికి పోటీ చేసే వీలుంది.

## అద్భుతాలు జరిగినా.. డబ్ల్యూటీసీ ఫైనల్‌లో

# భారత్‌కు చోటు కష్టమే!

- ఆస్ట్రేలియాపై వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిస్తేనే డబ్ల్యూటీసీ ఫైనల్‌లో చోటు
- 62.50 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా
- కివీస్ చేతిలో ఓటమితో రెండో స్థానానికి పరిమితమైన భారత్
- ఆస్ట్రేలియాను ఆ దేశ గడ్డపై ఓడించడం సులభం కాదంటున్న క్రికెట్ పండితులు



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో దారుణంగా ఓడిన భారత్‌కు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో చోటు క్లిష్టంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో అద్భుతాలు జరిగినా టీమిండియాకు ఫైనల్‌లో చోటు దక్కేలా కనిపించడం లేదు. సొంతగడ్డపై కివీస్ చేతిలో వైట్ వాష్ అయిన భారత్ తాజా ఓటమితో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో కిందికి దిగజారింది.

న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్న భారత జట్టు.. ఓటమి తర్వాత 58.33 శాతం పాయింట్లతో రెండో స్థానానికి దిగజారింది. ఆస్ట్రేలియా 62.50 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ 54.55 శాతం పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం భారత జట్టు త్వరలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. భారత జట్టు డబ్ల్యూటీసీ భవితవ్యాన్ని నిర్ణయించేది ఈ ట్రోఫీనే. ఈ ట్రోఫీలో భాగంగా మొత్తం ఐదు టెస్టులు జరగనుండగా డబ్ల్యూటీసీ ఫైనల్‌లో భారత్ చోటు సంపాదించుకోవాలంటే కనీసం నాలుగు మ్యాచుల్లో విజయం సాధించాలి. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించడం అంత సులభమైన పనేమీ కాదు. కాబట్టి ఏరకంగా చూసినా భారత జట్టుకు డబ్ల్యూటీసీ ఫైనల్‌లో చోటు కష్టంగానే కనిపిస్తోంది. అంతేకాదు, అదే సమయంలో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న జట్ల ఫలితాలపైనా భారత్ అదృష్టం ఆధారపడి ఉంటుంది.నిజానికి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నప్పటికీ ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఏకబిగిన నాలుగు టెస్టులు గెలవడం దాదాపు అసాధ్యమని క్రికెట్ పండితులు చెబుతున్నారు. 2018-19, 2020-21 సీజన్లలో ఆస్ట్రేలియాపై రెండేసి విజయాలతో భారత్ సిరీస్ సొంతం చేసుకుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని భారత్ 10 సార్లు సొంతం చేసుకుంటే, ఆస్ట్రేలియా ఐదుసార్లు గెలిచింది. 2014-15 సీజన్‌లో ఆస్ట్రేలియా చివరిసారి ఈ సిరీస్‌ను గెలుచుకోగా, 2004-05లో చివరిసారి భారత గడ్డపై సిరీస్ అందుకుంది.

## కమ్మిన్స్‌కే ఇలాంటివి సాధ్యం: ఓడిపోయే మ్యాచ్ గెలిపించిన ఆసీస్ కెప్టెన్

**హైదరాబాద్ పెన్ పవర్:** జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఎలా ఆడాలో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ కు తెలిసినంత మరెవరికీ తెలియదేమో. జట్టు ఓడిపోతున్నప్పుడల్లా బాధ్యతగా ఆడుతూ తమ జట్టుకు విజయాన్ని అందిస్తాడు. ఫాస్ట్ బౌలర్ గా పేరున్నప్పటికీ.. జట్టుకు అవసరమైనప్పుడల్లా సత్తా చాటతాడు. తాజాగా పాకిస్థాన్ తో జరిగిన తొలి వన్డేలోనూ కమ్మిన్స్ తీవ్ర ఒత్తిడిలో ఆసీస్ కు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. 8 వికెట్లు కోల్పోయి ఆసీస్ కష్టాల్లో ఉన్నప్పుడు 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ లో సోమవారం (నవంబర్ 4) ముగిసిన మ్యాచ్ లో పాకిస్థాన్ పై ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 204 పరుగుల ఓ మాదిరి లక్ష్యంతో దిగిన ఆస్ట్రేలియా ఒకదశలో 183 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కమ్మిన్స్ జాగ్రత్తగా ఆడుతూ పాక్ ఆశలపై నీళ్లు చల్లాడు. కమ్మిన్స్ తో పాటు స్టీవ్ స్మిత్ (44), జోష్ ఇంగ్లిస్ (49) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఇలాంటి ఇన్నింగ్స్ లు ఆడడం ఆసీస్ కెప్టెన్ కు కొత్తేమి కాదు. వరల్డ్ కప్ 2023.. యాషెస్ 2023లోనూ కమ్మిన్స్ తీవ్ర ఒత్తిడిలో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 46.4 ఓవర్లలో కేవలం 203 పరుగులకే ఆలౌట్ అయింది. 44 పరుగులు చేసిన కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. చివర్లో బౌలర్ నజీమ్ షా 40 పరుగులు చేసి పాక్ స్కోర్ ను 200 పరుగులు దాటించాడు. 37 పరుగులు చేసి బాబర్ అజామ్ పర్వాలేదనిపించాడు. 204 పరుగుల లక్ష్య ఛేదనలో ప్రస్తుతం ఆస్ట్రేలియా 33.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి గెలిచింది.





## ఈ నెలాఖరున ఐపీఎల్ మెగా వేలం.. ఎక్కడంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ రిటెన్షన్ లిస్టుపై ఉత్కంఠ వీడిన విషయం విదితమే. ఫ్రాంఛైజీలు కోట్లు కురిపించి కొందరిని రిటైన్ చేసుకోగా.. మరికొందరిని వేలంలోకి వదిలేశాయి. దాంతో, వేలంలోకి వచ్చే ఆటగాళ్లు ఎవరు? ఫ్రాంఛైజీలు అంటిపెట్టుకున్న ఆటగాళ్లు ఎవరు? అనే సందిగ్ధత తొలగిపోయింది. ఈ నేపథ్యంలో రాబోవు ఐపీఎల్ ఎడిషన్ కోసం మెగా వేలం నిర్వహించేందుకు బీసీసీఐ సమాయత్తమవుతోంది.

ఐపీఎల్ 2025 ఎడిషన్ మెగా వేలం సౌదీ అరేబియా రాజధాని రియాద్ నగరంలో జరగనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. నవంబర్ 24, 25 తేదీలలో వేలం జరగనుందని సమాచారం. వేలం కోసం పలు నగరాల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ, బీసీసీఐ ఎడారి నగరం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

**ఆ ముగ్గురిపైనే అందరి కళ్లు**

డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్.. శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్)ను వదులుకోగా, ఢిల్లీ.. రిషభ్ పంత్(కెప్టెన్), లఖ్‌నవూ.. కేఎల్ రాహుల్( కెప్టెన్)ను వేలంలోకి వదిలేసింది. ప్రస్తుతానికి ఈ ముగ్గురిపైనే భారీ హైప్ ఉంది. వీరి కోసం ఫ్రాంఛైజీలు భారీ మొత్తాలను వెచ్చించే అవకాశం లేకపోలేదు. ఈ ముగ్గురితోపాటు యువ బ్యాటర్ ఇషాన్ కిషన్, ఆల్ రౌండర్ వెంకటేశ్ అయ్యర్, పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, దీపక్ చాహర్, మహమ్మద్ సిరాజ్ లు సైతం భారీ ధర పలకవచ్చని అంచనా వేస్తున్నారు. విదేశీ ఆటగాళ్లలో డుప్లెసిస్(ఆర్‌సీబీ కెప్టెన్ ), మిచెల్ స్టార్క్, జోస్ బట్లర్, మొయిన్ అలీ, శాంట్నర్, గ్రీన్, జాక్స్, మ్యాక్స్‌వెల్, కాన్వే, రచిన్ రవీంద్రలు అధిక ధర పలికే చాన్స్ ఉంది.

**రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితా**

**చెన్నై సూపర్ కింగ్స్:** రుతురాజ్ గైక్వాడ్, మతీషా పతిరనా, శివమ్ దూబే, రవీంద్ర జడేజా , ఎంఎస్ ధోని.

**ఢిల్లీ క్యాపిటల్స్:** అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ , ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్.

గుజరాత్ టైటాన్స్: రషీద్ ఖాన్, శుభమాన్ గిల్ , సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, షారుక్ ఖాన్.

**కోల్‌కతా నైట్ రైడర్స్:** రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ , ఆండ్రీ రస్సెల్, హర్షిత్ రాణా, రమణదీప్ సింగ్.

**లక్నో సూపర్ జెయింట్స్:** నికోలస్ పూరన్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోని.

**ముంబై ఇండియన్స్:** జస్ప్రీత్ బుమ్రా , సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా , రోహిత్ శర్మ , తిలక్ వర్మ.

**పంజాబ్ కింగ్స్:** శశాంక్ సింగ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్.

**రాజస్థాన్ రాయల్స్:** సంజు శాంసన్, యశస్వి జైస్వాల్, రియాన్ పరాగ్, ధృవ్ జురెల్, షిమ్రోన్ హెట్మెయర్ , సందీప్ శర్మ.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:** విరాట్ కోహ్లీ, రజత్ పటీదార్, యశ్ దయాల్.

సన్‌రైజర్స్ హైదరాబాద్: పాట్ కమిన్స్ , అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, ట్రావిస్ హెడ్.

# హాట్ బ్యూటీల నోట ఆ మాట..అదేంటంటే?







విథిక షేరు యొక్క డ్రెస్ మీ దవడ డ్రాప్ చేస్తుంది

**హైదరాబాద్ పెన్ పవర్:** బీచ్ అంటే ఎవరికి ఇష్ట ఉండదు. సాగర తీరం అందాలని ఆస్వాదించాలనే దేశాలు..ఖండాలు సైతం దాటెళ్లిపోతుంటారు సెలబ్రిటీలు. మాల్దీవులతో వివాదం లేనంత కాలం ఎంచక్కా హీరయిన్లు అంతా ఫ్లైట్ ఎక్కి అక్కడ వాలిపోయారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. మాల్దీవులకు ధీటుగా లక్ష్య దీవుల్ని రెడీ చేస్తున్నారు. అండమాన్ దీవులు అంతే అందంగా ఉంటాయి. దేశంలో ఇతర సాగర తీరాలను మరింత వృద్ధిలోకి తీసుకొస్తున్నారు. మరి ఈ బీచ్ బ్యూటీ గురించి హాట్ భామల మనసులో ఏమనుకుంటు న్నారంటే?... నేషనల్ క్రష్ రష్మిక మందన్నా అలల శబ్దానికి కష్టాలన్నీమర్చిపోతుందిట. మనసు ప్రశాంతంగా ఉటుందదంది. అలాగే శ్రీలీల %-%బీచ్ ని దగ్గర నుంచి చూస్తే భావోద్వేగాలు అదుపులో ఉండవు అంది. చిన్న పిల్లలా మారిపోతుందిట. నీలం రంగు నీళ్ల వైపు అలా చూస్తుంటే మనసు తెలియని ఆనందానికి లోనవుతుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. %సూశ్రీంశీ =ఘుం% - గొప్ప వ్యక్తిత్వంతో మనసులు గెలుచుకున్న గాయకుడు %-%తీరానాకి సముద్రం రాసే ప్రేమ లేఖలు అలలు%-% అంటూ హాట్ బ్యూటీ కేతిక శర్మ ముందుకొచ్చింది. ఇక అలియాభట్ బీచ్ లో సన్ సెట్ ని చూస్తుంటే ప్రపంచాన్నే మర్చిపోతుందిట. %-%నీళ్లను చూస్తే చాలు మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. పాడిల్ బోర్డింగ్ అయితే పక్కా ఉండాలి అంటోంది సంయుక్తా మీనన్. ఇక సారా అలీఖాన్ బీచ్ ఇష్టమా? కొండలు చూడటం అంటే ఇష్టమా? అంటే బీచ్ లో సన్ సెట్ ని ఇష్టపడుతన్నట్లు తెలిపింది. ఇక ప్రగ్యా జైశ్వాల్ మనసునైతే సముద్రం దోచేస్తుందిట. అలాగే మాలీవుడ్ బ్యూటీ అనుపమ బీచ్ లో బర్త్ డే చేసుకుంటే ఆ కిక్కే వేరప్పా అంటూ పవన్ కళ్యాణ్ డైలాగ్ కొట్టింది. సూర్యోదయం నుంచి సూర్యాస్త మయం వరకూ బీచ్ లో గడపడం ఎంతో ఇష్టం అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. ఇక బీచ్ అందాల్లో ఈ బ్యూటీలంతా ఎలా చెలరేగుతారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. టూపీస్...బికినీ...స్విమ్ షూట్ లో దూరిపోతారు. హాట్ ఫోటోలతో వైవిధ్యమైన భంగిమలతో ఆకట్టుకోవడం పరిపాటే.

కృతి శెట్టి మీరు ఆమె స్టైల్‌పై విరుచుకు పడతారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com